

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శనివారం 28 ఫిబ్రవరి 2026 19 పేజీలు




# పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపాలి

- రైతు భరోసా వెంటనే చెల్లించాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్ల కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని, రైతు భరోసా బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. గురువారం కరీంనగర్ నగరంలోని 51వ డివిజన్‌లో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి (మిగతా 2లో)

# పట్టాదార్ పాస్ పుస్తకాల జాప్యం

- అన్నదాతలకు అడ్డంకులు
- కోనరావుపేటలో తీవ్ర ఆందోళన
- రుణాలు, పథకాల లబ్ధి నిలిచిపోయింది



**సూర్య కోనరావుపేట**

తెలంగాణ రాష్ట్రంలో భూ లావాదేవీలు, రికార్డుల నిర్వహణను సులభతరం చేయాలనే ఉద్దేశంతో గతంలో ధరణి చట్టం అమలులోకి తీసుకువచ్చారు. ఆ చట్టంలోని లోపాలను సవరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి చట్టంను అమలు చేస్తోంది. చట్టాల్లో మార్పులు జరిగినప్పటికీ, గ్రామీణ స్థాయిలో రైతులకు ఎదురవుతున్న సమస్యలు మాత్రం పరిష్కారం కానట్లుగా కనిపిస్తున్నాయి.భూమి కొనుగోలు చేసినా, వారసత్వంగా పట్టా మార్చుకున్నా 15 రోజుల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు పోస్టు ద్వారా ఇంటికే చేరేవి. కానీ ప్రస్తుతం ఆరు నెలలు గడిచినా పాస్ పుస్తకాలు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. పోస్టల్ శాఖలో ఆలస్యం జరుగుతోందా? లేక జారీ ప్రక్రియలోనే జాప్యం జరుగుతోందా? అన్న విషయంపై స్పష్టత లేక రైతులు అయోమయంలో ఉన్నారు. రెవెన్యూ అధికారులను సంప్రదించినా సరైన సమాధానం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2లో

### న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్నవారు

# అలాంటి వ్యాఖ్యలు చేయరు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్నవారు అలాంటి వ్యాఖ్యలు చేయరని, హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పుల అనంతరం సంబంధిత స్థలం ప్రభుత్వానికి చెందినదని స్పష్టమైందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అక్రమంగా ఉన్నవారిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పేదల ఇళ్ల కూల్చివేతలను తక్షణమే నిలిపివేసి, రైతు భరోసా బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేస్తూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు.ఈ వ్యాఖ్యలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. సంబంధిత కోర్టు తీర్పు పత్రాలను కేంద్ర మంత్రి గారికి పంపిస్తామని, అవగాహనతో మాట్లాడాలని సూచించారు. రాజకీయ ఆరోపణలు బాధ్యతాయుతంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ నివేదికతో పాటు కోర్టు తీర్పుల వివరాలు పంపితే పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, కాళేశ్వరం ప్రాజెక్ట్ రుణభారంలో గత రెండేళ్లలో రూ.48 వేల కోట్లు కిస్తీలు చెల్లించామని వెల్లడించారు. వరుసగా రెండు బడ్జెట్లలో కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు అందలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే విధంగా కాకపోయినా, కనీసం అందులో సగం అయినా తెలంగాణకు (మిగతా 2లో)

### కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రా



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్ , పలువురు జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చంద్రగ్రహణం ప్రభావం

- రాజన్న ఆలయం మూసివేత

**సూర్య, వేములవాడ**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మార్చి 3వ తేదీ మంగళవారం రోజున మూసివేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కేతుగ్రస్త చంద్ర గ్రహణం సంభవిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 6:15 నిమిషాల నుండి రాత్రి 7:15 వరకు గ్రహణ ప్రభావం ఉండనుంది. ఈ కారణంగా ఉదయం 6:15 గంటలకే ప్రధాన ఆలయంతో పాటు, అనుబంధ ఆలయాల ద్వారాలను కూడా మూసివేస్తారు.గ్రహణానికి ముందు ఆలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున గం. 3:40 నుండి 4:15 వరకు సంప్రోక్షణ, మంగళ వాయిద్యాలు, 4:15 నుండి 4:45 వరకు సుప్రభాత సేవ, గం.5:00 నుండి 6:00 వరకు: ప్రాతఃకాల పూజలు,దర్శనాలు ఎప్పుడు ప్రారంభమవుతా యి. రాత్రి 7:15 గంటలకు గ్రహణ కాలం ముగిసిన తర్వాత ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రదోష పూజ, మహా నివేదన పూర్తి చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆలయ అధికారులు కోరారు.



# పట్టాదార్ పాస్ పుస్తకాల జాప్యం

సూర్య, కోనరావుపేట

**- కోనరావుపేట మండలంలో తీవ్ర సమస్య**

కోనరావుపేట మండలంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. గత ఏడాది నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న పలువురు రైతులకు ఇప్పటికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదని సమాచారం. తహసీల్దార్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా స్పష్టమైన సమాధానం లభించక రైతులు నిరాశ చెందుతున్నారు. పాస్ పుస్తకాలు లేక బ్యాంకుల్లో పంట రుణాలు పొందలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా వంటి పథకాలకు అర్హత ఉన్నప్పటికీ అవసరమైన భూ పత్రాలు లేక దరఖాస్తు ప్రక్రియలో ఆటంకాలు




ఎదురవుతున్నాయని తెలిపారు.

**- ఆగస్టులో రిజిస్ట్రేషన్... ఇప్పటికీ పాస్ పుస్తకం లేదు**

గతేడాది ఆగస్టులో భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. ఇప్పటివరకు పట్టాదారు పాస్ పుస్తకం రాలేదు. పాస్ పుస్తకం ఉంటే యాసంగి పంట కోసం రుణం తీసుకునేవాళ్లం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కూడా దరఖాస్తు చేసుకునేవాళ్లం. ఆరు నెలలు దాటినా స్పందన లేదు అని కోనరావుపేట మండలానికి చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

**- ఉన్నతాధికారులు స్పందించాలి**

పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియలో జాప్యంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సకాలంలో రైతులకు పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. భూమి పత్రాలు చేతిలో లేక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితిని వెంటనే సరిచేయాలని కోనరావుపేటతో పాటు పలు గ్రామాల్లో డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

# భక్తిశ్రద్ధలతో నరసింహుని కళ్యాణం..

## - పోటెత్తిన భక్తజనం

సూర్య, తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్లగొండ గ్రామంలో వెలసిన శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధి ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారి కళ్యాణాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా, అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం, సర్వాంగ సుందరంగా అలంకరించిన కళ్యాణ మండపంలో సీతారామ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణాన్ని జరిపించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ వేడుకను తిలకించేందుకు నల్లగొండ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. “గోవిందా.. నర సింహా..” నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోయింది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బండారిపెల్లి లక్ష్మణ్ గౌడ్, కార్యనిర్వహణాధికారి నాగుల అనిల్ కుమార్, ధర్మకర్తలు గాజుల అంజయ్య, బుత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మిరాజం చారి, జినుక



శ్రీనివాస్, కవ్వంపల్లి మహేష్, గోలి లక్ష్మి, తో పాటు పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.





# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

## - పుట్ట బంగారం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సూర్య, ధర్మపురి:

ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయంలో అర్చకులు స్వామివారికి అంకురార్పణ, కలశ స్థాపన వరాహ తీర్థము తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు కట్ట నుంచి పుట్ట బంగారం సేకరించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా చింతామణి చెరువు గట్టుకు తీసుకువచ్చి వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట బంగారం సేకరణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి లో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు పొందాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, దేవాలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, దేవాలయ మాజీ చైర్మన్ సంగనబట్ల దినేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.





# పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపాలి

(మొదటి పేజి తరువాయి)

వేణు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి బండి సంజయ్ పలు అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మించామని, పేదలకు గృహాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పోటీ పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చడంలో పోటీ పడుతోందని విమర్శించారు. నానా కష్టాలు పడి ఇళ్లు కట్టుకున్న పేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమని, ఈ చర్యలు కొనసాగితే ప్రజలే ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని హెచ్చరించారు. కూల్చివేతలు ఆపకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.రైతు భరోసా విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం రైతు భరోసా చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, కానీ ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని విమర్శించారు. మూడు వాయిదాల పేరుతో సుమారు రూ.27 వేల కోట్లు రైతులకు బకాయి ఉన్నాయని ఆరోపించారు. వెంటనే రైతు భరోసా చెల్లించాలని ఇప్పటికే ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతలు తప్ప మరేమీ సాధించలేదని, 6 గ్యారంటీలు అమలు కాలేదని అన్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలు ప్రజలకు వెల్లడించామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తన హామీల అమలు విషయంలో స్పష్టత ఇవ్వాలని సూచించారు.కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒకటేనని, బయటకు విభేదాలున్నట్టు నటిస్తున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని ఎన్నికల సమయంలో చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు విచారణ జరిపే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. అవసరమైతే కేంద్రం విచారణకు సిద్ధమని, ఇందుకు ముఖ్యమంత్రి లేఖ రాయాలని కోరారు.రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ అభివృద్ధే తమ లక్ష్యమని, కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొచ్చి నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్నవారు అలాంటి వ్యాఖ్యలు చేయరు

(మొదటి పేజి తరువాయి)

కేటాయించాలని డిమాండ్ చేశారు.రైతు భరోసా సహా ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేసిన పొన్నం ప్రభాకర్, కోర్టు తీర్పులను అందరూ గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. తెలంగాణపై వివక్ష చూపుతున్న బీజేపీ తన వైఖరిపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

# మత్స్య కార్మికులకు ఉపాధి కల్పించేందుకు పథకాలు

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్..**

**- బోయినపల్లి మండలం నర్సింగాపూర్ లో మంచినీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ప్రారంభం..**

**- మత్స్య కార్మికులకు పరికరాల పంపిణీ..**

సూర్య, బోయినపల్లి ..



మత్స్య కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆద్వర్యంలో బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామంలో రూ. 8 లక్షల 91 వేలతో మంచినీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, శుక్రవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్రీనివాస్, ఎన్ ఎఫ్ డీబీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కన్నప్ప, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్వీ మురుగన్, జిల్లా మత్స్య అధికారి సౌజన్యతో కలిసి ప్రారంభించారు. నర్సింగాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి అందించారు. అనంతరం చేప పిల్లల పెంపకం చేసే యూనిట్ ను ప్రారంభించారు. చేప పిల్లల ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు చేప పిల్లలకు వేసే దాణా, మందులు, చేపల వేటలో వినియోగించే వలలు, పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. మంచినీటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణరెడ్డి ,ఆర్ఐ మనోజ్ కుమార్, జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ సౌజన్య, అడిషనల్ డైరెక్టర్ ఫిషరీస్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ వి శ్రీనివాస్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎస్ వి మురుగన్, జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ రామచంద్రం, జైన్ డైరెక్టర్ ప్రకాష్ ముత్తు, ఫిష్ అడ్వైజర్ విద్యాసాగర్ రెడ్డి ,సీనియర్ సైంటిస్ట్ శ్యాంప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ సునీల్ కుమార్, సర్పంచ్ మడిశెట్టి సరిత, బొజ్జ లక్ష్మీరాజం తదితరులు ఉన్నారు.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
రాజన్నసిరిసిల్ల
శనివారం 28 ఫిబ్రవరి 2026 3


## చిప్పలపల్లిలో
# పశువుల నీటి తొట్టి పునర్నిర్మాణంపై ఉద్రిక్తత

**- గ్రామసభ తీర్మానం మేరకు పనులు ప్రారంభం - ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించవద్దు**

**- గ్రామ సర్పంచ్ మాశెట్టి లక్ష్మణ్ విన్నపం**

**సూర్య,ముస్తాబాద్**

చిప్పలపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్టి పునర్నిర్మాణం అంశంపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ సర్పంచ్ వివరాల ప్రకారం గ్రామంలో గతంలో ఒక ప్రాంతంలో ఉన్న పశువుల నీటి తొట్టిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి ధ్వంసం చేసి తమ సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై ఇటీవల నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజల మధ్య చర్చ జరిగింది.గ్రామసభ తీర్మానం మేరకు పాత స్థలంలోనే పశువుల నీటి తొట్టిని తిరిగి నిర్మించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకు



న్నారు. తీర్మానం ప్రకారం పునర్నిర్మాణ పనులను శుక్రవారం రోజున ప్రారంభించగా, ఆక్రమణదారుడు అక్కడికి చేరుకోగా వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్య గురించి చర్చించి గొడవను సద్దుమణిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామసభ తీర్మానాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, అభివృద్ధి పనులకు ఎవరైనా ఆటంకం కలిగించవద్దని వినిపించుకున్నారు.గ్రామాభివృద్ధి కోసం అందరూ సహకరించాలని కోరారు.ప్రభుత్వ అభివృద్ధి పనులు అడ్డుకున్నా,గొడవలకు దిగినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.గ్రామంలో శాంతిభద్రతలు కాపాడాలని పోలీసులు సూచించగా, పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉన్నట్లు సమాచారం.అభివృద్ధి పనులు ప్రజల ప్రయోజనార్థమే జరుగుతున్నాయని, అందరూ సహకరించాలని గ్రామ సర్పంచ్ మాశెట్టి లక్ష్మణ్ కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి

**- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి - విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**- వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి**

**సూర్య, వేములవాడ**

అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అగ్రహారం వద్ద గల కె-కన్వెన్షన్ హాల్లో జెఎన్‌టీయుహెచ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం వలన రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వాహనం నడిపే సమయాల్లో హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, తప్పని సరి అని, అతివేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపడం,ర్యాష్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని విద్యార్థులకు వివరించారు.




**- సైబర్ నేరాల పట్ల అప్రమత్త అత్యవసరం**

ప్రస్తుతం సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారం ఎవరికీ పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**- గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి హానికరమని వివరించారు. మత్తు పదార్థాల వ్యసనం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.

**- మహిళల రక్షణ కోసం జిల్లా షీ టీమ్ సేవలు**

మహిళల భద్రత కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.మహిళలు,విద్యార్థులు ఎలాంటి వేధింపులు గురైన నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు.మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు రామ్మోహన్, రాజు,షీ టీమ్ ఏ ఎస్.ఐ ప్రమీల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతి

**సూర్య, చందుర్తి**



చందుర్తి మండలం ప్రాథమిక పాఠశాల సనుగులలోచంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, న్యాతరి నాగమణి, చింతల హరిప్రియ, ఎగోళం మాధవి, యాస నవ్య విద్యార్థులు ఉన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**సూర్య, తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లిలో మండలంలోని 160 మంది లబ్ధిదారులకు రూ 1,60,18,560 విలువైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఆర్డీవో వెంకటేశ్వర్లు గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వెలుమల స్వరూపతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదింటి ఆడపిల్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ ప్రకాష్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నేరెళ్ల నర్సింగం గౌడ్ గ్రామాల సర్పంచ్‌లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ చంద్రయ్య

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను శుక్రవారం అదనపు ఎస్పీ చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాస్తున్నారని తెలిపారు.వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ భార్గవి, ఉపాధ్యా యులు ఉన్నారు.

## గొల్లపల్లెలో పశు వైద్య శిబిరం

**సూర్య ఇల్లంతకుంట**



మండలం లోని గొల్లపల్లే గ్రామంలో ప్రభుత్వం పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించి, మందులను ఆ అర్హతులకు సర్పంచ్ రదం లక్ష్మి చేతుల మీదుగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఓ, డిఎల్‌డిఎ శ్రీదేవి, పశు వైద్యాధికారిణిలు ఇందిరా, పూర్ణచంద్రిక, ఉప సర్పంచ్ ఒరుపుల లక్ష్మన్, వార్డ్ సభ్యులు పత్రి అంజయ్య, దాసరి ఎల్లయ్య, రదం నాగయ్య, సూపర్ వైజర్ రాములు, గోపాల మిత్ర సభ్యులు రంజాన్, రాజయ్య, ఏసు రెడ్డి, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

## కత్తెరపాక అంజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**సూర్య బోయినపల్లి**



మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర పాక కొండయ్య అన్న కత్తెరపాక అంజయ్య గత వారం రోజుల క్రితం స్వర్గస్తులైన వారి కుటుంబ సభ్యులను కోదురుపాక గ్రామంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి వారి చిత్రపటానికి పూలమాల వేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వారి వెంట మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి,నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, జంపుక ఆనంద్, కొంకటి శేఖర్, నాగుల శ్రీనివాస్ గౌడ్, ముద్దం రవి, పాపారావు, కమల్ గౌడ్, సంజీవ్ కన్నం సాగర్ తదితరులున్నారు.

## మోకాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయవద్దు

**- ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



మోకాళ్ల నొప్పుల సమస్యలతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్, ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ రాకేష్ సూచించారు.మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ మోకాళ్ల నొప్పులు ప్రస్తుతం వయోవృద్ధులకే కాకుండా యువతలో అధికంగా కనిపిస్తున్నాయని,ఎక్కువసేపు నిలబడటం,అధిక బరువు,క్రీడలలో గాయాలు, కాల్షియం లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రారంభ దశలోనే వైద్యం తీసుకుంటే శస్త్రచికిత్స అవసరం లేకుండా మందులు, ఫిజియోథెరపీ ద్వారా నయం చేసుకోవచ్చన్నారు.మోకాళ్లలో వాపు, కదిలించేటప్పుడు చప్పుళ్ల రావడం,మెట్లు ఎక్కేటప్పుడు నొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు.సమస్య తీవ్రమైతే ఆర్థోస్కోపీ వంటి ఆధునిక చికిత్సలతో వేగంగా కోలుకునే అవకాశముందని వివరించారు. ప్రస్తుతం మెడికవర్ ఆసుపత్రిలో ఆధునిక పరికరాలతో తలపై భాగం నుండి పాదాల వరకు అన్ని రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఆరోగ్యకరమైన ఆహారం,నియమిత వ్యాయామం, బరువు నియంత్రణతో మోకాళ్ల సమస్యలను తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

జగిత్యాల

శనివారం 28 ఫిబ్రవరి 2026 4


# పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ప్రభుత్వం కృషి

**- విద్య, వైద్యానికి హబ్‌గా జగిత్యాల - నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తా**

**- ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్**

**సూర్య జగిత్యాల**

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో జగిత్యాల అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 42 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 11 లక్షల 70 వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రులను బలోపేతం చేస్తుందని, జగిత్యాల జిల్లా విద్య వైద్యానికి హబ్‌గా మారిం దన్నారు. 235 కోట్లతో 400 పడకల నూతన ఆసుపత్రి పనులు జరుగుతున్నాయనీ, 334 మంది వైద్య పోస్టులు మంజూరు అయ్యాయనీ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకప్పుడు 15 మంది వైద్యులు మాత్రమే ఉండగా నేడు 170 మందికి పోస్టింగ్‌లు వచ్చాయనీ, 135 మంది విధుల్లో పని చేస్తున్నారన్నారు. 365 మంది పారామెడికల్ స్టాఫ్ పోస్టులు కూడా మంజూరు అయ్యాయనీ తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో 10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింప చేయటానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి పేదలకు చాలా ఉపయోగ పడుతోందని, జగిత్యాల నియోజకవర్గంలో 14 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసుకున్నా మన్నారు. మారు మూల ప్రాంతాల్లో సైతం నాణ్యమైన వైద్య సేవలు అందు తున్నాయనీ, జిల్లాలో అత్యధిక పల్లె దవాఖానలు జగిత్యాలకు మంజూ రు అయ్యాయనీ, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జగిత్యాల ప్రజలకుతో మల్టీ స్పెషాలిటీ సేవలు అందుతాయి అన్నారు. తాను నిరంతరం ప్రజల కు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్ర మంలో నాయకులు ఎలా ల్రెడ్డి, కట్ట రాజేందర్, బొలిశెట్టి గంగారెడ్డి, గోడిసెల గంగాధర్, మహేష్, చెరుకు జాన్, మల్లేశం, ప్రకాష్, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరేందుకు నిరంతరం శ్రమించాలి

**- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరేందుకు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. పిఎం పోషణ్' తనిఖీ లో భాగంగా శుక్రవారం జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు అందిస్తున్న కామన్ మెనూ ప్రకారం వండుతున్న ఆహారాన్ని పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు తదితర అంశాలను సమీక్షించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, పదో తరగతి విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం తీసుకుంటున్న ప్రణాళికలపై అక్కడి స్పెషల్ ఆఫీసర్లు మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక తరగతులు, రివిజన్ ప్లాన్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు తెలుసుకుని, కమిటీ సమావేశాలు నియమితంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న అన్ని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడిగి వారి చదువు, లక్ష్యాలు, ఆశయాల గురించి తెలుసుకుని ప్రోత్సహించారు. చదువును ఇష్టంతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకొని మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం, వసతి సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ రామ్మోహన్, కెజిబివి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం

**- అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్**

**సూర్య మెట్‌పల్లి**

ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ముప్పై ఏళ్లుగా ప్రజా క్షేత్రంలో ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలను నీతి నిజాయితీతో పాటు ఓపిక సహనానికి మారుపేరుగా కమిషనర్ మోహన్ నిలిచారని ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం అని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ నేడు పదవి విరమణ చేస్తుండగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ సిబ్బంది పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ రాములు, డిఆర్డిఏ పీడీ రఘు వరన్, సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఒంకారి నవీన్, జగిత్యాల, కోరుట్ల, రాయికల్, చొప్పదండి కమిషనర్‌లు, వార్డు కౌన్సిలర్లు కమిషనర్ ను సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ. కమిషనర్ మోహన్ 30 ఏళ్లకు పైగా వివిధ చోట్ల అంకితభావంతో విధులు నిర్వర్తించాడని. మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధిలో తనదైన స్థాయిలో ముద్ర వేసి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ. మెట్‌పల్లి పట్టణంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తూ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడని. మోహన్ సేవలు పట్టణ ప్రజలు మరచిపోలేరని. పదవి విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి సహజమని ఆయన పదవీ విరమణ పొందడం బాధాకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## కౌన్సిలర్ లక్ష్మిని సన్మానించిన మాజీ మంత్రి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు అరవ లక్ష్మి రాజు కౌన్సిలర్ గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం వారికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. కౌన్సిలర్‌గా ఐదేళ్ళు ప్రజా సంక్షేమం, వార్డ్ అభివృద్ధికి పాటుపడాలని జీవన్ రెడ్డి కౌన్సిలర్ అరవ లక్ష్మి ఏసిఎస్ రాజుకు సూచించారు. కార్యక్రమంలో ఎలగందుల చంద్ర శేఖర్, మోతే వార్డు మెంబర్ భగవంతు, మాజీ ఎంపీపీ రమేష్ బాబు, ఒడ్డెడ మాజీ సర్పంచ్ అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు ఎల్బిపిల సన్మానం

**సూర్య మెట్‌పల్లి**



పదవీ విరమణ పొందుతున్న మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ను మున్సిపల్ లైసెన్స్ ఇంజనీర్లు సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా హృదయపూర్వకంగా అభినందించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పదవి విరమణ తర్వాత ఆయన జీవితం సంతృప్తికరంగా, ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎర్. మొహమ్మద్ మొహీద్, ఎర్. మొహమ్మద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ వితరణ

**సూర్య మల్లాపూర్**



మండలంలోని వాల్గొండా గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పిఆర్ టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుంబాల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘ వేందర్ మాట్లాడుతూ..సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడేలా పాఠశాలకు మైక్ సెట్‌ను అంద జేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, విజయ్ కుమార్, ప్రగతి, నవీన్ కుమార్, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ఆల్ఫోర్స్ స్కూల్స్ ఫేర్వెల్ వేడుకలు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల కృష్ణానగర్, శివ వీధిలో గల ఆల్ఫోర్స్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ, 9వ తరగతి విద్యార్థుల కోసం "జాయ్" పేరుతో ఆత్మీయ వీడ్కోలు సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి, మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి రావాలంటే జీవితంలో క్రమశిక్షణను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా మెలగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను, మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు పాటలు, నృత్యాలతో అలరించి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా తీర్చిదిద్దారు. అనంతరం చైర్మన్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

పెద్దపల్లి

శనివారం 28 ఫిబ్రవరి 2026 

## విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలి

**- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు - మధర్ థెరిస్సా కళాశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు**

**సూర్య - పెద్దపల్లి రూరల్**

విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అస్త్ర శీర్షికన వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అప్పుడే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని హితవు పలికారు. సన్మార్గంలో పయనించి భవిష్యత్ కు బంగారు బాటలు



వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. చెడుకు దూరంగా ఉండాలని లక్ష్య సాధనలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ తొడుపునూరి శ్రీనివాస్ వార్షిక నివేదికని సమర్పిస్తూ గత ఏడాది విద్యార్థులు సాధించిన అకాడమిక్ ప్లేస్మెంట్, క్రీడా విజయాలను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు స్కిట్లు, సంగీత ప్రదర్శనలు ఆహుతలను విశేషంగా అలరించాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ అడవల్లి నవీన్ కుమార్, డైరెక్టర్ ఎడవల్లి నవత, అధ్యాపకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం ఫలితాలలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థి కుమారపు రవళిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ ఏ. రమేష్, డాక్టర్ శ్రీధర్, వంశీరాజ్, సవిత, రవి, డాక్టర్ టి. రమేష్, అకౌంట్ ఆఫీసర్ పి. పవన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్ లు జాగ్రత్తగా వాహనాలు నడపాలి

**సూర్య సుల్తానాబాద్**



లారీ డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడిపి తమ గమ్యస్థానాలను చేరుకొని సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై చంద్రకుమార్ అన్నారు. ఆలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా సి పి ఆదేశాలు మేరకు లారీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు ఉచితంగా నేత్ర పరీక్ష లు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లా డుతూ వాహనాలను నడిపేటప్పుడు రాంగ్ రూట్ లో నడప రాదని, అతి వేగం ప్రమాదకరమని, వాహనం నడిపే ముందు వాహన కండిషన్, ఫిట్నెస్ చెక్ చేసుకోవాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లారీ వాహనాలు ప్రమాదా లు జరిగితే పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వాటిల్లుతుందని జాగ్రత్తగా నడిపి గమ్యస్థానానికి చేరుకొని సురక్షితంగా ఇంటికి చేరుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై అశోక్ రెడ్డి, పోలీ సులు, నేత్ర వైద్య నిపుణులు, లారీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## రచ్చపెల్లి రత్నాలు పుస్తకవిష్కరణ, విద్యార్థులు ఒక ప్రణాళిక బద్ధంగా చదవాలి

**-డాక్టర్ పిఎం షేక్**

**సూర్య ధర్మారం**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల స్వీయ రచనతో వెలువరించిన 'రచ్చపల్లి రత్నాలు" బాలల కవితా సంపుటి పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి. ఎం. షేక్ శుక్రవారం రోజున రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీయ రచనతో వేసే పుస్తకాలు వారిలో సృజనాత్మకతను పెంపొందించడానికి, భాష పట్ల ఆసక్తి కలిగించడానికి ఉపయోగపడుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఏ.ఎం.ఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. పిల్లల ఊహాశక్తి అపారమై




నదని వారు ఏ విషయాన్నైనా ఆసక్తితో నేర్చుకుంటారని అందుకే వారికి చిన్న వయసు లోనే పాఠశాల పట్ల, చదువు పట్ల ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని అన్నారు. ప్రాథమిక పాఠశాల పిల్లలు అయినప్పటికీ చక్కని భావంతో అందమైన కవితలు రాశారని వారిని ఈ విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు.రచ్చపల్లి రత్నాలు పుస్తకంలో 20 మంది విద్యార్థుల కవితలు ఉన్నాయి. వారి కవితలను పుస్తక రూపంలో ప్రచురించి విద్యార్థులను ప్రోత్సాహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమాద్రాల వంశీ మోహనాచార్యులను ప్రత్యేకంగా అభినందించారు. రచ్చపల్లి రత్నాలు పుస్తకాన్ని తెలుగు ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త కందుకూరి భాస్కర్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పోతు ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, గ్రామ సర్పంచ్ సూర రజిత వెంకటేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్ పర్సన్ ప్రమీల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల వంశీ మోహనాచార్యులు, వాఖ్యత నూతి మల్లయ్య ఉపాధ్యాయులు లక్ష్మణ్, సంపత్,సతీష్, లక్ష్మి, కవిత, గ్రామ పంచాయితీ సెక్రెటరీ ప్రకాష్,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కు ఘనంగా సన్మానం

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా సేవలందించిన నరేడ్ల సునీత పదవి విరమణ కార్యక్ర మాన్ని గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి యం. ఈ. ఓ సిరిమల్లె మహేష్,స్థానిక సర్పంచ్ బంగారు రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేడ్ల సునీత విద్యార్థులకు అందించిన సేవలు అమూల్యమని,పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారని,వారితో కలిసిపోయి ఎల్లప్పుడూ ప్రోత్సహించే వారని అన్నారు.ఆమె పదవి విరమణ మా పాఠ శాలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఉపసర్పంచ్ గోలి సుధాకర్,ఉపాధ్యాయ బృందం,పాలకవర్గం, ప్రజాప్రతినిధులు,నాయకులు, విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**-సర్పంచ్ కప్పల ప్రవీణ్**

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు గ్రామంలోని లో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ పాల్గొని విద్యార్థులకు స్వయంగా పరీక్షా సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే చదువు ఎంతో ముఖ్యమని, తల్లి దండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నార ని గుర్తుంచుకోవాలని సూచిం చారు. చెడు ఆలోచనలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి రాబోయే పరీక్షలపై పూర్తి దృష్టి సారించాలని, ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నవారికి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులకు అన్ని విధాల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారో, ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారో తెలుసు కుని వారితో చర్చించారు. కొంతసేపు విద్యార్థులను చదివించి, వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.పరీక్షలకు ముందు ప్రోత్సాహంగా ప్యాడ్లు, పెన్నులు అందజేసి విద్యార్థులకు "ఆల్ ది బెస్ట్" తెలిపారు.ఈ కార్యక్ర మంలో హైస్కూల్ హెచ్ఎం దేవేందర్ రావు, వార్డ్ సభ్యులు నరేందర్, రమేష్, మధుకర్, రాకేష్, నాయకులు బోయిని సత్యం, గొడుగుల మహేందర్, అడ్డగుంట తిరుపతి, ముంజంపల్లి అనిల్, సుమన్, రాకేష్, అజయ్, రండి సతీష్, సురేష్ తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖాన ను సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆకస్మికంగా సందర్శన

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ పల్లె దవాఖాన ను శుక్రవారం గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమాచారం సేకరించేందుకు ఈ సందర్శన చేపట్టారు.ఈ సంద ర్భంగా దవాఖానలో అందుబాటులో ఉన్న టాబ్లెట్లు, ఇతర అత్యవసర మందుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, అవసరమైన ఔషధాలు సమృద్ధిగా ఉన్నాయా లేదా అన్న విషయంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో తగిన చికిత్స అందేలా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.గ్రామంలో నమోదైన రోగుల సంఖ్య, రోజువారీగా చికిత్స పొందుతున్న వారి వివరాలు, గర్భిణీలు, వృద్ధులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి పరిస్థితులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఆశా వర్కర్లు గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సేవలు, ఇంటింటికి వెళ్లి చేస్తున్న పర్యవేక్షణ, టీకాల కార్యక్రమాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. రోగులకు సమయానుకూలంగా సేవలు అందించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, దవాఖాన సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలి

**- మంథనిలో అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో మంథని సీఐ బి.రాజు గౌడ్**

**సూర్య మంథని**



రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని మంథనిలో అరైవ్ – అలైవ్ కార్యక్రమంలో మంథని సీఐ రాజు సూచించారు. శుక్రవారం మంథని ఒపట్టణంలో సీఐ ఆధ్వర్యంలో అరైవ్–అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం 2026 లో భాగంగా, మంథని సర్కిల్ పరిధిలోని మంథని, రామగిరి, ముత్తారం పోలీస్ స్టేషన్ ల పరిధిలోని డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 120 మంది డ్రైవర్లు హాజరయ్యారు. అవసరమైన డ్రైవర్లకు సీఐ రాజు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవి కుమార్, మంథని ఎస్ఐ -2 సాగర్ లతో కలిసి విజయవంతంగా నిర్వహించారు.

## ఘనంగా డాక్టర్ పొన్నం రవిచంద్ర రచించిన

# “తెలంగాణ సినీ ప్రస్థానం” పుస్తక పరిచయ సభ

**సూర్య కరీంనగర్**



డాక్టర్ పొన్నం రవిచంద్ర రచించిన “తెలంగాణ సినీ ప్రస్థానం” పుస్తక పరిచయ సభ ఈ రోజు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ క ల్చరల్ సెంటర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు కె.వి. విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా, దర్శక నిర్మాత వేణు ఊడుగుల ఆత్మీయ అతిథిగా, ప్రముఖ సినీ జర్నలిస్ట్ ప్రభు, దర్శకులు అల్లాణి శ్రీధర్, సినీ పుస్తక రచయిత ఎస్ వీ రామారావు, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. “తెలంగాణ సినీ ప్రస్థానం” పుస్తకాన్ని ప్రముఖ రచయిత మామిడి హరికృష్ణకు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ – మాది కరీంనగర్ జిల్లా. చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం, సినిమాల మీద ఆసక్తి ఉండేది. మా సొంత బుక్ స్టాల్ కోసం అనేక సినిమా పత్రికలు తీసుకునేవాళ్లం. ఆ పత్రికల్లో సినిమా వార్తలు చదువుతూ, వాటి పేపర్ కటింగ్స్ భద్రపరిచాను. అప్పుడే పైడి జయరాజ్ గురించి తెలుసుకున్నాను. నేను సేకరించిన సినీ సమాచారంతో 80 ఏళ్ల తెలుగు సినీ ప్రస్థానం పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకానికి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో నంది పురస్కారం దక్కింది. ఇప్పుడు తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తకాన్ని తీసుకురావడం సంతోషంగా ఉంది. నాకు సినిమా జర్నలిజంలో గురువులా భావించే మామిడి హరికృష్ణకు ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నా. తెలంగాణ ప్రాంత సినిమా గురించి ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు గానీ పైడి జయరాజ్, ఆయనకు ముందు నుంచే చాలామంది తెలంగాణ ప్రాంత నటీనటులు, సాంకేతిక నిపుణులు సినిమా ఇండస్ట్రీలో ఎంతో ప్రతిభ చాటారు. ఇప్పుడు మన టాలీవుడ్ లో ఉన్న టాప్ డైరెక్టర్స్ లో కనీసం పది మంది తెలంగాణ వారు ఉండటం విశేషం అన్నారు. ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు కేవీ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ – తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తక రచనతో పొన్నం రవిచంద్ర గారు ఒక గొప్ప ప్రయత్నం చేశారు. అలాగే ఆ సినిమాలను తిరిగి మన ప్రేక్షకులు చూసేలా కూడా ఆయన ప్రయత్నం చేయాలని కోరుతున్నా. తెలంగాణలో ఎన్నో కళలు ఉన్నాయి. ఎంతోమంది గొప్ప కళాకారులు ఉన్నారు. వారి ప్రతిభ ప్రపంచానికి తెలిసేలా చేస్తే చాలా బాగుంటుంది. మన తెలుగు సాంస్కృతిక చరిత్రకు చిహ్నంగా మారిన రవీంద్ర భారతిలో కనీస సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. అన్నారు.ప్రముఖ సినీ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ – పొన్నం రవిచంద్ర గారు తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తక రచనతో ఒక గొప్ప ప్రయత్నం చేశారు. ఈ పుస్తకాన్ని మామిడి హరికృష్ణకి అంకితమివ్వడం ఎంతైనా సముచితం. సినిమా పరిశ్రమకు తెలంగాణ, ఏపీ అనే బేధం లేదు. ప్రతిభావంతులు ఎక్కడున్నా సినీ పరిశ్రమ ఆదరిస్తుంది, అక్కున చేర్చుకుంటుంది. అన్నారు.ప్రముఖ రచయిత మామిడి హరికృష్ణ మాట్లాడుతూ – తెలంగాణ సినిమా గురించి ఎంతో సమాచారాన్ని పొన్నం రవిచంద్ర గారు ఈ పుస్తకం ద్వారా తెలియజేసే ప్రయత్నం చేయడం అభినందనీయం. ఆయన నాకు ఈ పుస్తకాన్ని అంకితమివ్వడం గౌరవంగా భావిస్తున్నా. పొన్నం కుటుంబంతో నాకు ఎంతో అనుబంధం ఉంది. అన్నారు.తెలంగాణ సినీ ప్రస్థానం పుస్తకంలోని సమాచారం ఎంతో విలువైనదని, చాలా విషయాలు తెలుసుకునేలా చేసిందని దర్శకుడు వేణు ఊడుగుల, అల్లాణి శ్రీధర్, ఇతర అతిథులు ప్రశంసించారు. అనంతరం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుని డా. హరి కుమార్, డా. పావని, వివేక్‌లు రవిచంద్రు అందించగా విజయేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు.నాగర్ఎస్ కర్నూల్ అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, సినీ పుస్తక రచయిత ఎస్. వి. రామారావు, సినీ జర్నలిస్ట్ ప్రభు, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి, ప్రకాష్ రెడ్డి, సివి నవీన్ కుమార్, కత్తి చేతన్, గౌని తిరుపతి, ఉదయ్, పోల్సాని వేణు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హుజురాబాద్ ఎంఈఓగా విడపు శ్రీనివాస్

**సూర్య హుజురాబాద్**



హుజురాబాద్ మండల నూతన విద్యాధి కారిగా విడపు శ్రీనివాస్ ఎంఆర్సి భవ నంలో శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఎంఈఓగా పని చేసిన భూపతి శ్రీనివాస్ స్థానంలో ప్రభుత్వం సిర్సపల్లి గెజిటెడ్ హెచ్ఎంగా పని చేస్తున్న విడపు శ్రీనివాస్‌ను నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జమ్మికుంట ఎంఈఓగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. మండలంలో ఉత్తీర్ణత శాతం పెరగడానికి అందరి సహకారం తీసుకుంటానని ఆయన అన్నారు. ఆయన పదవి బాధ్యతలు స్వీకరించడం పట్ల కే. శ్రీనివాస్ రెడ్డి, రవీంద్ర చారి, కట్టా రవీంద్ర చారి, బి. శ్రీనివాస్, కేవి. నరసింహా రెడ్డి, మండలంలోని ఉపాధ్యాయ సంఘం నాయకులు టి. మాధవ రావు, భాగ్యరేఖ,ఈశ్వర్ రెడ్డి, చిరంజీవి, కైరునిసా బేగం, ప్రదీప్, రాజేందర్, తిరుమల, రాజిరెడ్డి, చిరంజీవి, పరాంకుశం వెంకటేశ్వర స్వామి, ఆదర్శన్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోరెశీ సంజీవ రెడ్డి, నాయకులు పరెడ్డి రవీందర్ రెడ్డి, బద్దుల రాజ్ కుమార్, కామని రవీందర్, పరాంకుశం కిరణ్ కుమార్, మాడిశెట్టి ప్రసాద్, పిల్లల సతీష్, తిరుపతి యాదవ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**సూర్య కరీంనగర్**




కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన పోగుల సంపత్ అనునతడు తన ట్రాక్టర్ నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు.అట్టి నిందితుడిని అదుపులోనికి తీసుకొని అట్టి ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది. తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## వాహనదారులకు అడ్డుగా ఉన్న ఈద్గా గోడను తొలగించాలి

**- జనసేన సభ్యత్వ నమోదు పార్లమెంట్ కోఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి**

**సూర్య కరీంనగర్**



కరీంనగర్‌లో కళాభారతి సమీపంలో వాహనదారులకు అడ్డుగా ఉన్న ఈద్గా గోడను తొలగించాలని జనసేన సభ్యత్వ నమోదు పార్లమెంట్ కోఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా బేతి మహేందర్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి రూ.2 కోట్లు విరాళంగా అందించి తొలి సభ్యత్వాన్ని స్వయంగా స్వీకరించినట్లు ఆయన తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నామని, తెలంగాణలోనే కరీంనగర్‌ను సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలుపుతామని చెప్పారు.అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ అగ్రనేతల అంతర్గత ఒప్పంద రాజకీయాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని స్పష్టం చేశారు. తన నియామకానికి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ప్రచార కార్యదర్శి ఆర్.కే. సాగర్, ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు రాధారం రాజలింగం వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కందుల రాజీ రెడ్డి, శివ రెడ్డి, పెంటాల మహేష్, పొన్నాల తిరుపతి, వోద్నాల రాజు, జంగ మహేష్, వీర్ల శ్రీనివాస్ రావు, సిరిసిల్ల రాము, కందకట్ల స్వరూప, చింటూ పాల్గొన్నారు.

## ప్రమాద బాధితున్ని పరామర్శించిన సత్య ప్రసన్నా రెడ్డి

**సూర్య రామడుగు**



రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తండ్రి బుర్ర లచ్చగౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుండి పడి గాయాల పాలయ్యారు. శుక్రవారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి బాధితున్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రావుపేట్ మార్కెట్ కమిటీ సభ్యులు శేఖర్ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి

## - మేయర్ కొలాగాని శ్రీనివాస్

**సూర్య కరీంనగర్**



మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగి అభివృద్ధి దిశలో ముందుకు పయనించాలని కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కొలాగాని శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని తీగల గుంటపల్లిలో కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్‌గా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం తెలంగాణ మున్నూరు కాపు సంఘం సభ్యత్వన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్‌చే చేపించి అనంతరం మున్నూరు కాపు డైరీని ఇవ్వటం జరిగింది.ఈ సందర్భంగా మేయర్ కొలాగాని శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపు ఐక్యత సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. కరీంనగర్‌లో అత్యధిక శాతం జనాభా కలిగిన మున్నూరు కాపులు రాజకీయాలకతీతంగా ముందుకు సాగి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు.మున్నూరు కాపులందరినీ సంఘటితశీ చేసి ఏకతాటిపై నడిపించేందుకు సభ్యత్వం ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగి బలమైన శక్తిగా తయారుకావాలన్నారు. మున్నూరు కాపులు అన్ని రంగాలలో ముందుకు సాగలన్నారు. మున్నూరు కాపులందరినీ ఒక తాటి మీదికి తీసుకువచ్చి మున్నూరు కాపులందరినీ సంఘటిత పరిచలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి కూరగాయల తిరుపతి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేనీ శ్రీనివాస్ ,మంకమ్మతోట మున్నూరు కాపు సంఘం అధ్యక్ష్యులు ముప్పిడి సునీల్, మండల కన్వీనర్ ఆవుల శ్రీనివాస్, కర్ర రామలింగం,బాకం శ్రీనివాస్ మున్నూరు కాపు కుల బాంధవులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

**సూర్య రామడుగు**



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామంలోనీ స్వయంభు స్తంభాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అగ్ని ప్రతిష్ట ధ్వజరోహణం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవశీ కన్నుల పండువగా కళ్యాణోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు సరోజన గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగరావు మాజీ సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భక్తుల ఇంటికే భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణ తలంబ్రాలు

**సూర్య కరీంనగర్**



టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేరవేసే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ రీజనల్ ఆఫీస్‌లో రీజనల్ మేనేజర్ బి. రాజు, ఏవో రవికుమార్, పిఓ సంపత్, లాజిస్టిక్స్ సిబ్బంది ఆవిష్కరించారు. భక్తులు రూ.151 చెల్లించి 31-03-2026 వరకు తలంబ్రాలను బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం కరీంనగర్: 9154298561, 9154298581, హుజురాబాద్, హుస్నాబాద్: 9154298559, సిరిసిల్ల, వేములవాడ: 9154298576, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి: 7780250439, గోదావరిఖని, పెద్దపల్లి, మంథని: 9949407275 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఏడో డివిజన్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

## - మేయర్ కొలగాని శ్రీనివాస్

## - మేయర్ కు కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్ ఘన సన్మానం

**సూర్య కరీంనగర్**

కరీంనగర్‌లోని ఏడో వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పలు డివిజన్లలో ఆకస్మిక పర్యటన చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని 7వ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీని సందర్శించి అక్కడి శానిటేషన్ సిబ్బంది హాజరు శాతాన్ని, వారి పనితీరును పరిశీలించారు. దీంతోపాటు పాటు కాలనీలోని రెండు పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్ డివిజన్‌లోని పలు సమస్యలు మేయర్





దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే మేయర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా మేయర్‌గా ఛార్జ్ తీసుకున్న వెంటనే ప్రజల వద్దకే వచ్చి నేరుగా వారి సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమని కార్పొరేటర్ పేర్కొన్నారు. మొదటి సారి కాలనీకి వచ్చిన సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ ను స్థానిక కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నందిని ఉదయ్,తోట అనిల్, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్, తోట రాజేందర్, నరసింహచారీ, వాసు గౌడ్, నలువాల రాజేందర్, జాజల భాస్కర రావు, గుర్రాల శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది ఎంహెచ్ఓ సుమన్, శ్యంరాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్‌లో ఉపాధ్యాయ బదిలీలు

## - టీచర్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి

**సూర్య కరీంనగర్**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు ఏప్రిల్‌లో నిర్వహిస్తారని రేషనలైజేషన్‌కు సంబంధించిన GO 25ను సవరణ చేయించి బదిలీలు చేపట్టే విధంగా PRTU సంఘం కృషి చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ పట్టణంలో ఫిబ్రవరి నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు పి.ఆర్.టి.యు టి.ఎస్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు అందజేసే డిజిటల్ హెల్త్ కార్డులపై ఎలాంటి అపోహలు ఉండకూడదని ఖచ్చితంగా ఇవి



ఉద్యోగులకు మేలు చేస్తాయని తెలియజేశారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ లేకుండానే పదోన్నతులు ఇవ్వాలని, తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడంతోపాటు ప్రతి పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయొచ్చని ప్రభుత్వానికి సూచించారు. అ పరిష్కృత సమస్యల సాధనకై PRTU సంఘం TGEJACలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటానికి సిద్ధం కావాలని, ఒకవేళ సంఘాలన్నీ కలిసి రాకపోతే పిఆర్‌టియు ఒంటరిగానైనా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందని తెలియజేశారు. ఫిబ్రవరి నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న వేముల మహిపాల్ రెడ్డి, కర్యాద మల్లారెడ్డిలను ఎమ్మెల్సీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి సంఘ బాధ్యులు తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రావు, జమీల్, లక్ష్మీనారాయణ, రామ్మోహన్ రావు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులుపాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

## - బిజెపి డిమాండ్

**సూర్య, హుజురాబాద్**

ప్రజల ఆరోగ్యం పై, పర్యావరణం పై ప్రభావం చూపే డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వెంటనే విరమించుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణ శివారులోని సిర్సపల్లి గుట్టల మధ్య ఏర్పాటు చేయబోయే డంపింగ్ యార్డ్ ప్రతిపాదన విరమించుకోవాలని నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ ప్రతిపాదనలు విరమించుకోవాలని నినాదాలు చేశారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చెత్తను మొత్తం ఇక్కడ వేస్తే ప్రజలకు తీవ్ర




ఇబ్బందులు ఎదురు అవుతాయని అన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ఇక్కడి ప్రజలు అనారోగ్యం పాలవుతారని, అలాగే ఇక్కడ ఉన్న వ్యవసాయ భూములు కూడా పాడవుతాయని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని అన్నారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదన ఉపసంహరించకుంటే భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, పట్టణ మాజీ ఫ్లోర్ లీడర్ పైళ్ల వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు కోలుగురి సుమలత, సుమన్, అనురాగ్, రోహిత్, లక్ష్మిదుర్గ, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్, తిప్పబత్తిని రాజు, యాంసాని శశిధర్, అంకతి వాసు, దామెర అనురాగ్, సర్పంచ్ ముప్పు మహేష్, బొరగాల సారయ్య, పవన్ కుమార్, కురిమిళ్ల శ్రీధర్, మోటపోతుల రాకేష్, ఎర్ర శ్రీధర్, కుమారస్వామి, ఇల్లందుల ప్రణీత్, కొలుగురి శిరీష, అనిల్, పదారి సుమన్, బొడిగే రాధ, సుదర్శన్, గొట్టే రవీందర్, అయిత సందీప్, భీమాజు వెంకట్, బండి సాయి, కృష్ణ, రాజేష్ ఖన్నా,నీలం రవీందర్,కుసుమ సమ్మయ్య, తిప్పబత్తిని రాజేందర్, తూర్పాటి రాజశేఖర్, రామ్ చంద్రం, పురాణం శ్రీనివాస్, విజయ్, సురేష్, అనిల్, సాగర్ పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో ఇబ్బంది పడుతున్న కోర్కల్ ప్రజలు

## - రోడ్డు పై బైఠాయించి ధర్నా, రాస్తారోకో...

**సూర్య, వీణవంక**

గత కొంత కాలం నుండి రోడ్డు విస్తరణ పనులు వీణవంక నుండి కరీంనగర్ వరకు జరిగాయి. అందులో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో శ్రీరాముల పేట – కోర్కల్ గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో రోజుకు సుమారు వందల లారీలు, బస్సులు నడుస్తుండడంతో దుమ్ము, దూళితో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పలు వాహనాలు ప్రమాదాల బారిన పడటం జరిగిందని, ఆ గ్రామ ప్రజలు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రహదారి పనులు పూర్తి చేయలేకపోయారని, ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, కనీసం దుమ్ము రాకుండా వాటర్ కొట్టాలని, తక్షణమే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



### అకాల మరణం చెందిన మిత్రుడి జ్ఞాపకార్థం...

# 5,000 శునకాలకు వ్యాక్సిన్లు విరాళం

**సూర్య కరీంనగర్**

అకాల మరణం చెందిన మిత్రుడిపై ఉన్న మమకారాన్ని ఓ వినూత్నమైన, సేవా దృక్పథంతో కూడిన పద్ధతిలో చాటుకున్నారు. అతని స్నేహితులు. ఇటీవల అకాల మరణం



చెంది, అందరినీ విడిచి తిరిగిరాని లోకాలకు వెళ్లిన బుట్టం సాయి తేజ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి మిత్రబృందం ఒక గొప్ప కార్యక్రమం చేపట్టింది. సాయి తేజకు జంతువులంటే ఉన్న అమితమైన ప్రేమను దృష్టిలో ఉంచుకుని, ఆయన జ్ఞాపకార్థం శుక్రవారం కరీంనగర్ జిల్లా పశు వైద్యశాలలో భారీ స్థాయిలో వ్యాక్సిన్లను డొనేట్ చేశారు. సుమారు 5,000 కుక్కలకు సరిపడా వ్యాక్సిన్లను పశువైద్య అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయి తేజ మిత్రులు మాట్లాడుతూ తను మాతో లేదనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం. తను జంతు ప్రేమికుడు కాబట్టి, మూగజీవాల ఆరోగ్యానికి మేలు జరిగేలా ఈ వ్యాక్సిన్లను విరాళంగా ఇచ్చాం. ఈ సేవా కార్యక్రమం ద్వారా అతని పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలని, అతని ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం అని ఆవేదనతో తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి తేజ మిత్రులు వడియాల సాయి చరణ్ రెడ్డి, ముక్కిస సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కవితపై కేసు కొట్టివేతపై తెలంగాణ జాగృతి సంబరాలు

**సూర్య కరీంనగర్**

తెలంగాణ జాగృతి అధినేత్రి కవితపై నమోదైన ఢిల్లీ లిక్కర్ కేసును రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేయడంపై కరీంనగర్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వ



ర్యంలో టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కవితపై రాజకీయ దురుద్దేశంతో పెట్టిన తప్పుడు కేసు కోర్టు ద్వారా కొట్టివేయబడటం సంతోషకరమన్నారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందనే దానికి ఈ తీర్పే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అధివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు వారల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్మ, పూదరి రజేశ్వరి గౌడ్, కుర్ర పోచాయ్య, గాలిపల్లి రత్నాకర్ చారి, యండి హుసైన్, జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బసవేణి రాజేందర్, కొత్తురి రఘు, గుండెటి తిరుపతి, పుసాల పవన్, ఎం.డి. రజీ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటీజన్ల క్రీడ పోటీలు

## - బహుమతులు అందజేసిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు

**సూర్య కరీంనగర్**

ప్రశాంత వాతావరణంలో ఒకరికి ఒకరు తోడుగా సీనియర్ సిటీజన్లు కలిసి ముచ్చటించుకోవడం ఆనందదాయకమని నగర డిప్యూటీ మేయర్ యాదగిరి



సునీల్ రావు అన్నారు. 42వ డివిజన్ భగత్‌నగర్ డే కేర్ సెంటర్‌లో ప్రణామ్ సీనియర్ సిటీజన్లకు నిర్వహించిన షటిల్, క్యారమ్, చెస్ క్రీడల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. పదవీ విరమణ అనంతరం డే కేర్ సెంటర్‌లో కలిసి గడపడం ఆదర్శమని, క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఉచ్చిడి మోహన్ రెడ్డి, ఇన్‌చార్జి అధ్యక్షులు మోసం అంజయ్య, ప్రధాన కార్యదర్శి పెంద్యాల కేశవరెడ్డి, ట్రెజరర్ చింతల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన నియామకం

**సూర్య కరీంనగర్**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులుగా మంకమ్మ తోటకు చెందిన సత్తినేని శ్రీనివాస్‌ను రాష్ట్ర ఛైర్మన్ సీమ శ్రీనివాస్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారులందరినీ సంఘటితం చేసి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియమాకానికి సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బొమ్మ వెంకన్న పేరుతో బ్లాక్ ఏర్పాటు చేయడం అభినందనీయం

### - రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### - లయన్స్ క్లబ్‌లో 'లయన్ బొమ్మ వెంకటేశ్వర్ బ్లాక్' ప్రారంభించిన మంత్రి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'లయన్ బొమ్మ వెంకటేశ్వర్ బ్లాక్'ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మ వెంకన్న పేరుతో బ్లాక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ సామాజిక సేవకు నిదర్శనమని, దూరదృష్టితో రేకుర్తిలో ఐ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసిన బొమ్మ వెంకన్న సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా లక్షలాది పేదలకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. 1988 నుంచి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 8 లక్షల 52 వేల మందికి ఓపీ



సేవలు, 1,21,000 మందికి ఉచిత శస్త్రచికిత్సలు, అలాగే 95 వేల మందికి బీపీఎల్ పరిధి దాటి ఉన్న వారికి సర్జరీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. 9 వేల గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడం ప్రశంస నీయమని అన్నారు.పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో 2010లో అన్యాక్రాంతమైన స్థలాన్ని అధికారులతో చర్చించి నాలుగున్నర ఎకరాలను స్మశాన వాటికకు కేటాయింపజేశానని గుర్తుచేశారు. లయన్స్ క్లబ్ లేకపోతే అక్కడ యూనిట్ ప్రారంభించి స్థలం కేటాయించే అవకాశం ఉండేదని తెలిపారు.విద్య, వైద్యం రంగాల్లో లయన్స్ క్లబ్ విశేష సేవలు అందిస్తోందని, భవిష్యత్తులో కూడా పేదలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. సామాజిక కార్యక్రమాల్లో యువత మరింతగా భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా లయన్స్ క్లబ్‌కు అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

# కోరుట్లలో రాజకీయ సంచలనం

### - సీనియర్ వైద్యుడు డా. వై. అనూప్ రావు బీజేపీలో చేరిక

**సూర్య కోరుట్ల**

కోరుట్ల రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్యుడు డా. వై. అనూప్ రావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఘన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పార్టీ కండువా కప్పి ఆయనకు క్రియాశీల సభ్యత్వం ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ముఖ్య అతిథులుగా హాజరై చేరికను మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కోరుట్ల నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు 100కార్లలో హైదరాబాద్‌కు బయలుదేరి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నూతన కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరై తమ మద్దతు తెలిపారు.





### "ప్రజా సేవ కోసం ప్రత్యక్ష రాజకీయాల్లోకి"

**- డా. అనూప్ రావు**

ఈ సందర్భంగా డా. అనూప్ రావు మాట్లాడుతూ దేశాభివృద్ధి, సమగ్ర ప్రజాసేవ లక్ష్యంగా బీజేపీలో చేరినట్లు వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని, ప్రజలకు మరింత చేరువై సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించనున్నట్లు స్పష్టం చేశారు.డా. అనూప్ రావు చేరికతో కోరుట్ల రాజకీయాల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. స్థానికంగా బీజేపీ బలోపేతానికి ఈ పరిణామం దోహదం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో

# Arrive -- Alive ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ చేపట్టిన Arrive -- Alive కార్యక్రమంలో భాగంగా డ్రైవర్ల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం అత్యంత విజయవంతమైంది. పోలీస్ శాఖ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా శిబిరంలో 448 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రులు ఈ శిబిరంలో పాల్గొని డ్రైవర్లకు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించాయి.డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్: 85 మందికి పరీక్షలు,వాసన్ ఐ కేర్: 96 మందికి పరీక్షలు,లయన్స్ డాక్టర్ మాడేకర్ ఐ హాస్పిటల్: 85 మందికి పరీక్షలు,శరత్ మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్: 95 మందికి పరీక్షలు,డాక్టర్ రాకేష్ ఐ హాస్పిటల్: 87 మందికి పరీక్షలు నిర్వహించినారు.పరీక్షల అనంతరం అవసరమైన డ్రైవర్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున 200 కళ్లద్దాలు, 200 కంటి చుక్కల మందులను ఉచితంగా అందజేశారు. అలాగే, రేకుర్తి హాస్పిటల్ వారు సుమారు 50 మందికి ఉచిత సర్జరీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. "సురక్షిత చూపు – సురక్షిత డ్రైవింగ్ – సురక్షిత గమ్యం" అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్ , అడిషనల్ డీసీపీ భీం రావు , ఏసీపీ లు వెంకటస్వామి , విజయకుమార్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున ప్రెసిడెంట్ లయన్ ఏ. రవీందర్ రెడ్డి, వి. రాధాకృష్ణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, గౌతమ్, హెచ్. రాజిరెడ్డి పాల్గొన్నారు.





## కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చిత్ర మిశ్రా, గురువారం నాడు జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు.జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవడంలో భాగంగా ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, తాజా పరిస్థితులు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్, సీపీలు క్లుప్తంగా చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా భద్రత కోసం రెవెన్యూ, పోలీస్ శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.



Ltd.
about:blank
NPDCL - NEW CONNECTION RECEIPT AA 31833289
...me: NPDCL
...nt: 27/02/2026
...ent TS-RFKR091
TTNC022602751783
Circle: KARIMNAGAR
Sub Division: JAMMIKUNTA
Consumer Name: CHANDRAMOULI KOMURAIAH
Category Type: DOMESTIC
Payment Mode: T-Wallet
Informant Name: CHANDRAMOULI KOMURAIAH
Application No: NC022602751783
Division: HUZURABAD
Applied Load (Watts): 1000 Watts
Amount Paid (in Rs.): 1970
The Transaction Id Should Be Kept For Further Correspondence.:
TGTS Limited, 2nd Floor, HACA Bhavan, Near Assembly, Hyderabad - 500 004.
Help Line Number : 9121107204, 9121107206
Please do not pay any extra amount to the franchisee other than the total amount printed in this receipt.
Sd/-
SHIVA COMMUNICATIONS
Signature

## మీసేవ నిర్వాహకుడి చేతివాటం...

### - కరెంట్ మీటర్ పేరుతో అదనపు వసూళ్లు...!

**సూర్య, వీణవంక**



వీణవంక మండల కేంద్రంలోని రంజిత్ మీసేవ సెంటర్‌లో సామాన్య ప్రజల నుండి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన మచబత్తుల చంద్రమౌళి అనే బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంటికి కొత్త కరెంట్ మీటర్ కోసం సదరు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. కరెంట్ మీటర్ డిడి చార్జీల నిమిత్తం వాస్తవానికి రూ. 1970 చెల్లించాల్సి ఉండగా, నిర్వాహకుడు మాత్రం రూ. 2600 వసూలు చేశాడు. చార్జీలు ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని బాధితుడు ప్రశ్నించగా, ప్రభుత్వం ధరలు పెంచిందని నమ్మబలికాడు. అయితే బాధితుడు ఇంటికి వెళ్లి తన మనవడితో తిరిగి ఫోన్ చేయించగా, విషయం బయటపడుతుందనే భయంతో నిర్వాహకుడు మాట మార్చాడు. "తహశీల్దార్ కి ఫిర్యాదు చేయవద్దు... మీ అదనపు నగదు రూ. 500 తిరిగి ఇచ్చేస్తాను" అంటూ బ్రతిమిలాడడం గమనార్హం. ఇలా అమాయక ప్రజల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ, ఫిర్యాదు చేస్తామంటే వెనక్కి ఇస్తామని చెప్పడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని చంద్రమౌళి కోరుతున్నారు.

## ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా నూతన కలెక్టర్ చిత్రా మిశ్రా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఆర్‌డబీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.



# అభివృద్ధికి నోచుకోని స్వయంభు శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామి

- వేలాలకు ముందే ఇక్కడ వెలసిన దేవుడు - స్వామి వారి పాదముద్రలతో కూడిన ఆనవాళ్ళు.
- ఇక్కడి నుండే వేలాలకు వెళ్లినట్టు పూర్వీకుల వాదన
- ప్రతి సంవత్సరం ఉగాది పండుగ ముందు ఆదివారము కొనసాగుతున్న జాతర
- జాతర నాడు స్వామివారికి పెద్దపట్నం-కళ్యాణ మహోత్సవం- అగ్నిగుండాలు
- మార్చ్ 1న కొనసాగనున్న జాతర- జాతర నాడు స్వామివారికి పట్నాలు బోనాలు సమర్పిస్తున్న భక్తులు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే జాతర ఏర్పాట్లు
- ఈ దేవాలయానికి వెళ్లడానికి దారి సరిగా లేక ఇబ్బంది పడుతున్న భక్తులు
- ఈ గుడిని ఎండోమెంట్లో చేర్చుకోవాలని భక్తుల డిమాండ్



**సూర్య, ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండల కేంద్రంలోని రాచపల్లి-మల్లన్నపల్లి గ్రామాలలో కొలువైన స్వయంభు శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామి దేవాలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా కీర్తించ బడుతుంది. గట్టు దేవుడు అంటేనే వరాలు కురిపించే స్వచ్ఛమైన దేవుడు. స్వయంగా స్వామి వారు పాదం మోపి వెలసిన ప్రాంతంగా చారిత్రక ఆనవాళ్ళు కలిగిన ప్రదేశం. అలాంటి ఈ ప్రదేశం అభివృద్ధికి నోచుకోక అరకొర సౌకర్యాలతో సరైన దారి లేక కేవలము నామమాత్ర కమిటీ సభ్యుల నిర్వహణలో దాతల సహాయంతో నడుస్తుంది.

**- ఆలయ చరిత్ర :**

గట్టు మల్లిఖార్జున స్వామి కోమళపల్లి గోవర్ధనగిరి నుండి బయలుదేరి ఇక్కడ పాదం మోపి వెలిసినట్లు బండ నేరిసిన ఆనవాళ్లను స్వామివారి పాదుకలను చూడవచ్చు. ఇక్కడే కొలువైన స్వామి వారు స్నానానికి బయలుదేరి వేలాల పక్కన ఉన్న గోదావరిలో స్నానమాచరించి సదుపాయాలు ఉండడంతో అక్కడే గుట్టపై వెలిసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. స్వామివారే స్వయంగా ఇక్కడ వెలిశాడు కాబట్టి స్వయంభు గట్టు మల్లిఖార్జున స్వామిగా కీర్తింపబడుచున్నారు.

**- జాతర నాటి విశేషాలు :**

ప్రతి సంవత్సరం ఉగాది పండుగ ముందు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించ బడుతుంది. శుక్రవారం ఉత్సవ విగ్రహాలకు కాళేశ్వరంలో గంగ స్నానం గావించి, శనివారం స్వామివార్లను రాచపల్లి మల్లన్నపల్లి మీదుగా ఊరేగింపుతో ఆలయ ప్రాంగణానికి తీసుకువస్తారు. తదనంతరం స్వామి వారికి మైలపోలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు రుద్రాభిషేకం గావించి అలంకరణ అనంతరం ప్రధాన ఒగ్గు పూజారులు మద్దూరి వంశస్థులు పెద్ద పట్నం వేసి అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవాన్ని జరిపిస్తారు. సాయంత్ర సమయంలో అగ్నిగుండ కార్యక్రమాన్ని జరిపించడంతో తంతు ముగుస్తుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు మొదటగా స్వామివారికి చిన్న పట్నం బోనాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటారు. ఆలయ పూజారులుగా భాషవేణ వంశస్థులు వ్యవహరిస్తూ దర్శనానికి వచ్చే భక్తుల కోరిక మేరకు స్వామివారికి పూజా కార్యక్రమాలను జరిపించి తీర్థప్రసాదాలను అందజేస్తారు.

**- ఆలయానికి సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్న భక్తులు :**

స్వయంభు శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. కమిటీ సభ్యులు గ్రామస్తులు చెప్పిన ప్రకారం ఆలయానికి నాగంపేట రోడ్డు మార్గంలో మజీద్ పక్కన ఈదుల మీదుగా ముప్పారం గుట్ట వరకు పాత నక్ష ప్రకారం ఒక గొలుసు పెట్టు (33 ఫీట్) దారి ఉందని, కానీ దానిని కబ్జా చేశారని కొందరు ఆరోపిస్తుండగా, మరికొందరైతే స్వామివారి భూమిని తప్పుగా కొందరు తమ పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. వారి కబంధహస్తాల నుంచి ఆలయ కమిటీ చొరవ తీసుకుని, బంధ విముక్తి గావించి స్వామి వారి గుడి వద్దకు పాత నక్ష ఆధారంగా సర్వే జరిపించి సీసీ రోడ్డును ఏర్పాటు చేయవలసిందిగా భక్తులు కోరుకుంటున్నారు.

**- ఆలయ కమిటీ ఏమి చేస్తున్నట్లు??**

శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామికి అప్పటి దొరలైన కట్టంగూరి వంశస్థులు కట్టంగూరి తిరుమలరెడ్డి-వెంకటరెడ్డి సోదరులు దయాగుణంతో చెరి 15 గుంటల భూమి మొత్తం 30 గుంటలను స్వామివారికి ఇచ్చారని, అయితే ఆ భూమిని కొందరు తప్పుగా తమ పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారని ఆరోపణలు ఉన్న, వారి నుండి స్వామివారికి చెందాల్సిన 30 గుంటల భూమిని సర్వే జరిపించి స్వామి వారి పేరున చేయించాల్సిన బాధ్యత ఆలయ కమిటీ భుజాల మీద ఉందని, వారు ముందు పడి స్వామి భూమిని స్వామి పేరున చేయించాల్సిందిగా భక్తులు కోరుకుంటున్నారు.

**- జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ చెప్పే వాటిలో నిజమెంత??**

శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామికి ప్రతి సంవత్సరం ఉగాది ముందు ఆదివారం నిర్వహించే జాతరకు గంగపట్నం మొదలుకొని స్వామివారికి పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు, పెద్దపట్నం, అన్నదాన ప్రసాదం వరకు అందరూ దాతలే. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల నుండి పట్నానికి ఆలయ అభివృద్ధికి కొంత నిర్దిష్ట రుసుమును వసూలు చేస్తూ ఆ వివరాలను, హుండీ ద్వారా వచ్చేటువంటి ఆదాయాన్ని బహిర్గతం చేయకపోవడం కొంత విమర్శలకు దారి తీస్తుంది. ఆలయ కమిటీ వారు చిత్తశుద్ధితో ఒక లక్ష్యసాధనతో తమ సొంత డబ్బులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పటికీ జాతర సమయంలో వచ్చే ఆదాయాన్ని భక్తుల సమక్షంలో లెక్కించి వివరాలను బహిర్గతం చేయకపోవడం పట్ల కొందరు అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. వారి అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత కూడా ఆలయ కమిటీ వారిదే?? ఎన్నో సంవత్సరాలుగా స్వయంభు శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయం అప్పట్లో 20 సంవత్సరాల క్రితం ఎలాగ ఉందో ఇప్పటికీ అలానే ఉందని, కేవలం జాతర సమయంలో హడావుడి చేసి జాతరను జరిపిస్తారు కానీ ఆ తర్వాత స్వామివారిని పట్టించుకునే నాధుడే లేడని భక్తులు వాపోతున్నారు. ఇన్ని సంవత్సరాల నుండి ఆలయం అభివృద్ధికి ఎందుకు నోచుకోలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు? జాతర సమయంలో స్వామివారికి ఖర్చు ఎంత అవుతుంది? స్వామివారికి వచ్చే విరాళాలు ఏమవుతున్నట్లు?? ఏమైనా మిగులు ఆదాయం ఉంటే ఆలయ అభివృద్ధికి ఏ రకంగా ఖర్చు పెడుతున్నారు అనే అంశాన్ని రెండు గ్రామాల ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఆలయ కమిటీపై ఉంది. జాతర అనంతరం భక్తుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా కమిటీకి ఉంది. అలాగే స్వయంభు శ్రీ గట్టు మల్లిఖార్జున స్వామి దేవస్థానాన్ని ఎండోమెంట్లో చేర్పించి, స్వామివారికి నిత్యం ధూప దీప నైవేద్యాలతో పూజలు అందుకునేలా చేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని భక్తులు కోరుకుంటున్నారు.

# తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక సిఫార్సులు అశాస్త్రీమైనవి.

**- డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి**

**సూర్య చందుర్తి**



తెలంగాణ విద్యా కమిషన్ ఎంతో ఆర్భాటంగా వెలువరించిన నివేదిక అది ఇచ్చిన సిఫార్సులు చాలా అశ్శాస్త్రీయ మైనవిగా ఆపేక్షకంగా ఉన్నాయని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి అన్నారు. డిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ అత్యవసర సమావేశం ను శుక్రవారం రోజున చందుర్తి మండలం ఏనుగుల్ ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు ఆవురం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి హాజరయ్యారు ప్రత్యేక అతిథులుగా డిటిఎఫ్ రాష్ట్రపూర్వ అధ్యక్షులు కే. నారాయణరెడ్డి , ఎం రగుశంకర్ రెడ్డి రాష్ట్ర డి టి ఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు బి సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిటిఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి ప్రసంగిస్తూ విద్యా కమిషన్ గ్రామీణ వాస్తవ పరిస్థితులను గమనంలోకి తీసుకోకుండా విద్యావేత్తల ఉపాధ్యాయ సంఘంల సూచనలకు పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా ఉన్న పాఠశాలను కుధిస్తూ మండలంలో మండలంలో నాలుగు ఫౌండేషన్ స్కూల్లో మూడు పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తంగా 4284 పాఠశాలలు మాత్రమే ఉనికిలో ఉండే విధంగా చేయడం సరైంది కాదు అని, విద్య ను కేంద్రీకరణ చేయడం వాంఛనీయం కాదని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజిరెడ్డి ఉద్ఘాటించారు. అలాగే పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయడం ద్వారా ఆశించిన ఫలితాలు రావు, విద్యా కమిషన్ ఉపాధ్యాయుల పదోన్నతులు సీనియార్టీలు కాకుండా పర్ఫామెన్స్ ప్రతిపాదికగా ఇవ్వాలనడం విద్యాశాఖ నిర్వహించే పరీక్షలు ఉత్తీర్ణులు కాకుంటే డిస్మిస్ చేస్తాననడం సరైనది కాదని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు పొందే వేతనాలను హేతుబద్ధీకరించాలని, తగ్గించాలని సిఫారసు చేయడాన్ని తప్పుపట్టారు.

డిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం. రఘు శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ప్రభుత్వ పాఠశాలను కుదించి ప్రైవేటు విద్యను ప్రోత్సహించేలా ఉందని తెలిపారు. దీర్ఘకాలంలో ప్రభుత్వ విద్యను తగ్గించి కేవలం గురుకులాలను, ఆశ్రమ పాఠశాలను మాత్రమే ఉనికిలో ఉంచే కుట్ర లో భాగంగా ఈ విద్యా కమిషన్ సిఫారసులని విమర్శించారు

డిటిఎఫ్ రాష్ట్ర మరో పూర్వ అధ్యక్షులు కే నారాయణరెడ్డి ప్రసంగిస్తూ విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని సిఫారసులను ఆహ్వానిస్తున్నానని కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర వార్షిక బడ్జెట్లో 30% నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూరె సదానందం ప్రసంగిస్తూ ప్రైవేటు విద్యను అదుపు చేస్తూ ప్రతి గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలని కోరారు. విద్య కుదింపు ద్వారా భవిష్యత్తులో సామాజిక సంక్షోభం ఉత్పన్నం అవుతుందని సదానందం గారు తెలిపారు. మొత్తంగా విద్యా కమిషన్ నివేదికను డిటిఎఫ్ వ్యతిరేకిస్తుందని తెలిపారు ఈ సమావేశంలో డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి డిటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు ఏ రాజేశ్వరరావు పూర్వ ప్రధాన కార్యదర్శి చకినాల దేవేందర్ డిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల పూర్వాధ్యక్షులు దొంతుల శ్రీహరి డిటిహెచ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సల్లావుద్దీన్ టి సురేష్ జిల్లా బాధ్యులు వెంకట రమణారెడ్డి పి రాజేశ్వరరావు ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. సురేష్, ఎం. మహేష్, ఎం. చక్రపాణి ,ఎస్ .జలంధర్ రెడ్డి ,బి. రాజు, ఈ .శ్రీనివాస్, జి. శ్రీనివాస్ ,వి .పరుశు రాములు, కే .శ్రీధర్ ,ఏ .శంకర్, జి. వేణుగోపాల్ ,కే .జనార్ధన్ పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల సంక్షేమ సంఘం నియామకాలు

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల మండలం పూడూరు గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల సంక్షేమ సంఘం జిల్లా స్థాయి నియామ కాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన ఆకుల శ్రీదేవిని, ఉపాధ్యక్షుడిగా నమిలికొండ గ్రామానికి చెందిన పబ్బ మహేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ, వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని, సంక్షేమ సంఘం ఇచ్చే ప్రతి పిలుపులో సభ్యులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కడారి మల్లేశం మాట్లాడుతు గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, పథకాలను అర్హుల వరకు చేర్చడంలో వార్డు సభ్యులు ముందుండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల సంక్షేమ సంఘం ద్వారా సభ్యులకు బలమైన వేదిక లభిస్తోందని, ఈ సంఘం గ్రామీణ పాలనను మరింత ప్రజాస్వామ్యబద్ధంగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎడమల పల్లి సంతోష్, వార్డు సభ్యులు రమేష్,తిరుపతి, మల్లేశం, శారద,ప్రసన్నకుమార్,సరిత,మౌనిక,లత,నవత, అనిల్ పాల్గొన్నారు.



# వేములకుర్తి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**- ఉత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయం**

**- రాతికట్టడాలతో అతి పురాతన ఆలయంగా ప్రసిద్ధి**

**- కోలిచినవారికి కొంగు బంగారంగా నిలుస్తున్న వెంకటేశ్వర స్వామి**

**- జాతర ఏర్పాటు పనుల్లో ఆలయ కమిటీ సభ్యులు**

**- నేటి మొదలు మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు**

**సూర్య ఇబ్రహీంపట్నం**

అతిపూరతన అలాయం దాదాపు ఐదు వందల సంవత్సరాల కాలం నాటి ఆలయాలలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఆలయం రాతితో ఏర్పాటు చేయబడి ఆలయ గర్భాలయం శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి మూలవిరాట్ ముడుమిటర్ల పోడవుతోపాటు స్వామివారి కుడి భాగాన గోదాదేవి అమ్మవారి రెండుమిటర్ల, స్వామివారి ఎడమ భాగాన రామనుజులవారి రాతి విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ఈ ఆలయంలో 12 మంది ఆళ్వారులు, సాలగ్రామాలు, గర్భాలయం పైన పద్మవ్యూహం తో రాతితో చెక్కబడ్డాయి. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన అతి పురాతన ఆలయం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం గోదావరి నదితిరన ఉంది ఈ ఆలయం ప్రతి సవత్సరం వార్షికంగా హోలీ కి మూడు రోజుల ముందు నుండి. దేవాలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల సహాయ సహకారాలతో ఉత్సవాలు జరుగుతాయి. కొన్ని సంవత్సరాలుగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ యజ్ఞర్చకులు చక్రపాణి వాసుదేవాచార్యలు ,చక్రపాణి నరసింహమూర్తి చార్యులు లచేతుల మిదుగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, యజ్ఞము, ఆలయ బలిహరణం కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు అలయ అర్చకులు మంత్రరాజం శ్రీనివాస్ చార్యులు,మంత్రరాజం జానకిరామచార్యులచే నిర్వహిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం ,యజ్ఞ మండపము, కళ్యాణ మండపము, తులసి కోట, శివపార్వతుల ప్రతిరూపమైన రావి,వేప,ఉసిరి చెట్లు భక్తుల పుజలు అందుకుంటున్నాయి. ఈ ఆలయానికి కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెంది ఉమ్మడి కరీంనగర్ ,ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి బ్రహ్మోత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఎర్పాట్లు పుర్తిచేసి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి బ్రహోత్సవాలకు సిద్ధంగా చేశారు.

## బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజువారీ కార్యక్రమాలు ఇలా ఉన్నాయి:-

28/02/ 2026 శనివారం రోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆలయంలో గోదావరి జలాలతో అభిషేకాలు అనంతరం నిత్యవిధి ఆరాధనం,స్వస్తి వాచనం, దేవతామూర్తుల స్థాపనలు, అగ్ని ప్రతిష్ట, హోమము, ధ్వజారోహణం, గరుడపెల్లి, ఆలయ బలిహరణం అనతరం నిథ్యవిది కార్యక్రమాలు

01/03/2026 అదివారం రోజున ఉదయం ఎనిమిది గంటలకు ఆలయంలో గోదావరి జలాలతో అభిషేకాలు,స్వామి వారి ములవిరాళ్ కు పులభిషెకం అనంతరం నిత్యవిధి ఆరాధనం,స్వస్తి వాచనం, దేవతామూర్తుల స్థాపనలు, హోమము, నిత్య పూర్ణాహుతి ,బలిహరణం అనంతరం ఆలయ నిత్యవిది కార్యక్రమాలు

02/03/2026 సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు గోదావరి జలలు, పంచామృత అభిషేకాలు స్వామి వారికీ నిర్వహించిన అనంతరం, నిత్యస్వస్తి వచనం ,యజ్ఞము పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం వెంకటేశ్వరస్వామి అలివేలుమంగా పద్మావతి అమ్మవారు గ్రామ ప్రదక్షణ ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణ మండపంలో అలివేలు మంగమ్మ ,పద్మావతి శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి వారికీ అర్చకులు చేతుల మీదుగా కళ్యాణం జరిపీచబడుతుంది.అనతరం స్వామివారి భక్తులకు గ్రామఅభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం, రాత్రికి స్వామివారి రథము గ్రామంలో ఊరేగింపు ప్రదక్షిణ, అనంతరం అర్చకులకు పండితులకు సన్మాన మహోత్సవ కార్యక్రమం జరుగనుంది.

**భక్తులకు కొంగు బంగారంగా వెంకటేశ్వర స్వామి;-**

**- ఆలయ అర్చకుడు..మంత్రి రాజం శ్రీనివాసు చార్యులు**

దాదాపు5వందల సవత్సరాల క్రితం పుర్వికులు నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఐదు వందల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు పండితులు అంచవేశారు. ఈ ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నావారికీ వారు అనుకున్న కోరికలు నెరవేర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందింది.దింతో భక్తుల తాకిడి పెరిగింది.

**గ్రామస్తుల సహకారంతో బ్రహోత్సవాలు**

**- అలయకమిటీ ఛైర్మన్ కోబ్బజి లక్ష్మి నర్సయ్య**

ప్రతి సంవత్సరం శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి బ్రహోత్సవాలు గ్రామస్తుల,భక్తుల సహకారం తో జరుగుతున్నాయి.అనదిగా బ్రహోత్సవాలు మూడురోజులపాటు సాగుతున్నయి భక్తులకు అరధ్యదైవం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారు భక్తులకు దర్షనం ఇస్తున్నారు.

## ఎలిగేడు ఎంపీపీ కార్యాలయంలో ఎన్నికల ఎస్ఐఆర్ డేటా మ్యాపింగ్‌పై అవగాహన కార్యక్రమం

**- రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య**

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలకు సంబంధించిన ఎస్ఐఆర్ డేటా మ్యాపింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య హాజరై పర్యవేక్షించారు.ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితాల ఖచ్చితత్వం అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశమని ఆర్డీఓ తెలిపారు. ఎస్ఐఆర్ డేటా మ్యాపింగ్‌ను సక్రమంగా నిర్వహించడం ద్వారా ఓటరు వివరాల్లో పొరపాట్లు నివారించవచ్చని చెప్పారు. ఓటరు జాబితాల పరిశీలన, పేర్ల చేర్పులు--తొలగింపులు, చిరునామా మార్పులు, పోలింగ్ కేంద్రాల వారీగా డేటా సమన్వయం వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు.బీఎల్ఓలు (బూత్ స్థాయి అధికారులు), సూపర్‌వైజర్లు, జీపీఓలు (గ్రామ పంచాయతీ అధికారులు), పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమయపాలన పాటిస్తూ ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సమన్వయం ఎంతో అవసరమని ఆర్డీఓ స్పష్టం చేశారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్నా, నాయబ్ తహసీల్దార్ అనిల్, ఎంపీఓ కిరణ్, బీఎల్ఓలు, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






## మార్చి 1న కరీంనగర్ లో ఉద్యమ కారుల కృతజ్ఞతా సదస్సు

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి**

**సూర్య మంథని**

మార్చి 1న కరీంనగర్ లో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమ కారుల కృతజ్ఞతా సదస్సు ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ లో మంథని నియోజక వర్గం ఇంచార్జీ గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు మాట్లాడుతూ, ఉద్యమకారులకు బాసటగా నిలుస్తామని ప్రజా ప్రభుత్వం హామీ ఇవ్వడం హర్షనీయమని, ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారునికి ప్రభుత్వం వెంటనే సంక్షేమ పథకాలు అందించాలని, ఉద్యమకారులను గుర్తించి వారికి పెన్షన్ తో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రజా ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై కరీంనగర్ లో కృతజ్ఞతా సదస్సును ఏర్పాటు చేస్తున్నామని, ఈ సదస్సు కరీంనగర్ లోని అమరవీరుల స్తూపం నుండి ప్రెస్ భవన్ వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, మంథని విజయ్ కుమార్, గుర్రం దేవేందర్,రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్,మంథని మండల అధ్యక్షుడు కాసిపేట సాంబయ్య, ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, ఉపాధ్యక్షుడు కొండల సమ్మయ్య, సీనియర్ ఉద్యమ నాయకుడు రొడ్డ లింగయ్య, జమ్మిడి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూలో రెండవ రోజు రసవత్తరంగా క్రికెట్ పోటీలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బి-జోన్ క్రికెట్ పోటీలు రెండవ రోజు రసవత్తరంగా సాగాయి. క్రికెటర్ల కేరింతలు, అరుపులు, చప్పట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. కొత్తగూడెం కి చెందిన అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల ఆడిన రెండు మ్యాచ్ లు నెగ్గి సెమీ ఫైనల్ కు అర్హత సాధించింది. శుక్రవారం రోజున వరంగల్కు చెందిన బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం కి చెందిన అకిట్స్ ఇంజనీరింగ్ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్ లో అకిట్స్ గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బిట్స్ 119 పరుగులు చేయగా అకిట్స్ 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మణికంఠ 44, హాలేశ్ 37, తిరుమలరావు 28 పరుగులు చేయగా హాలేశ్ 3, నవీన్, రాకేష్ చెరో రెండు వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ హాలేశ్ కు దక్కింది. రెండవ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన బిట్స్ 20 ఓవర్లలో 218 భారీ స్కోరు సాధించింది. పెద్దపల్లి ట్రినిటీ కేవలం 48 పరుగులు చేసి ఓడిపోయింది. లల్లు పటేల్ 63, బన్నీ 38, శరత్ 32 పరుగులు చేయగా మణికంఠ 3, లల్లు పటేల్ 2 వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా లల్లు పటేల్ ఎంపికయ్యారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్లో పెద్దపల్లి ట్రినిటి మొదట బ్యాటింగ్ చేసి33 పరుగులే చేసింది. విఘ్నేష్ హ్యాట్రిక్ తో సహా 4 వికెట్లు తీయగా, నవీన్ 3 వికెట్లు తీశారు. అకిట్స్ కేవలం 5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా విఘ్నేష్ ఎంపికయ్యారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లను సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియా పర్యావరణాధికారి రాజిరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి.సునీల్ కుమార్, అంపైర్లు ఫణీంద్ర, నిఖిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.



# వేసవికాలం సమీపిస్తుండడంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.

**- త్రాగునీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు బోర్లు,బావులకు మరమ్మతులు. - సుందరగిరి సర్పంచ్ జంగ శిరీష రెడ్డి.**

**సూర్య చిగురుమామిడి**

చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో నెలకొన్న త్రాగినీరు సమస్యకు శాశ్వత పరిష్కారం చెయ్యాలన్న లక్ష్యంతో రక్షిత మంచినీటి బావుల మోటార్లకు,బోర్లకు మరమ్మత్తులు చేస్తున్నట్లు సుందరగిరి సర్పంచ్ జంగా శిరీష వెంకటరమణారెడ్డి తెలిపారు.వేసవికాలం సమీపిస్తుండడంతో గ్రామంలోని పలు వార్డుల్లో త్రాగునీటి కష్టాలు మొదలవడంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.ఎండాకాలంలో త్రాగునీటి కష్టాలకు



చెక్ పెట్టేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. సుందరగిరి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఉన్న మంచినీటి బావి గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండడంతో ఆ బావి నీటిని ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామంలోని పాలు వార్డుల్లో 5బోరుబావుల మోటార్లను పైకి తీసి పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.మండువేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు ఉండవద్దనే లక్ష్యంతోనే గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి ముందుకు వెళ్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమాలల్లో గ్రామ ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్లేని సంపత్,వార్డు సభ్యులు,గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కట్లకుంట ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర వేళ :

**సూర్య మేడిపల్లి**



మండలంలోని కట్లకుంట ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాన్ సాగర్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అనుమల వైకుంఠం పర్యవేక్షణలో 34 మంది విద్యార్థులు సాంఘిక శాస్త్రవేళాలో ప్రతిభాపాటవాలను ప్రదర్శిం చారు. ఈ ప్రదర్శనలో భాగంగా భూమి ఏ విధంగా గుండ్రంగా ఉంది, దానికి గల కారణాలు, సమాజంలో పౌరుల యొక్క బాధ్యతలు, హక్కులు, ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధుల ఎన్నిక ప్రదర్శన, వివిధ దేశాల యొక్క కరెన్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు హనుమాన్ సాగర్ మాట్లాడుతూ వరుసగా నాలుగు సార్లు విద్యార్థుల యొక్క ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వైకుంఠం చేసిన కృషి అద్భుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి చింతకింది చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజయ్య, రమాదేవి, సంతోష్, గోపికృష్ణ, రవీందర్, ఇమామ్ లు పాల్గొన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఉద్యమకారుల సదస్సు.

**సూర్య ఓదెల**

ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షు డు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ ఆదివారం రోజున ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సదస్సు ఉదయం 10 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి ఫిలిం భవన్ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు ,వివేక్ వెంకటస్వామి, వడ్లూరి లక్ష్మి కుమార్ ,జూపల్లి కృష్ణారావు ,శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ,రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ , మేడిపల్లి సత్యం, కవంపల్లి సత్యనారాయణ, కల్వకుంట్ల సంజయ్ కుమార్ ,పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశి కృష్ణ , కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి జీవన్ రెడ్డి , ఏ ఒడిదల ప్రణయ్ బాబు, కేకే మహేందర్ రెడ్డి , నర్సింగరావు వెలిశాల రాజేందర్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కు చెందినటువంటి కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్ అందరినీ ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యమకారులను గుర్తించి సబ్ కమిటీ వేస్తున్నందుకు కృతజ్ఞతలు అభినందనలు తెలుపుతూ పెద్దపెల్లి జిల్లా తెలంగాణ ఉద్యమకారులు అందరు తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రజా ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున కృతజ్ఞతలు అభినందనలు తెలియజేస్తూ కార్యక్రమానికి ఉద్యమకారులందరూ పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కొలనూర్ మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్ రాష్ట్ర కార్యదర్శి కందుల సదాశివు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బింగి రాజు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చర్ల పెల్లి సురేష్ గౌడ్ రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి పిడుగు కృష్ణ మంత్రి నియోజక వర్గ ఇన్చార్జి గోగుల రాజిరెడ్డి మేర శంకరయ్య జిగురి రాజేందర్ జిదుల సారయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు దుబ్బెడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## సదాసీదాగా గ్రామసభ

**- పలు అంశాలపై ప్రశ్నించిన వార్డు సభ్యులు, గ్రామస్థులు**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో శు క్రవారం నిర్వహించిన గ్రామసభ సాదాసీదాగా సాగింది. అరకొర మందితో గ్రామసభ తూతూ మంత్రంగా ముగిసింది. ప్రజలు పెద్దగా హాజరు కాకపోవడంతో అభివృద్ధి పనులపై పెద్దగా చర్చ జరగలేదు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, వార్డుల్లో వేసవి కాలం దృష్ట్యా మంచి నీటి సరఫరా చేయాలని పలువురు కోరారు. సమావేశాలకు, గ్రామ సభకు తమకు ముందస్తు సంచారం, మినిట్స్ ఎందుకు అందించడంలేదని పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు నిలదీశారు. గ్రామపంచాయతీలో నిధుల నిల్వ వివరాలు చెప్పాలని పట్టుబట్టారు. ఎలాంటి తీర్మానాలు లేకుండానే గ్రామపంచాయతీకి సున్నం వేసే పనులు ఎలా చేశారని సర్పంచ్ ను ప్రశ్నించారు. పోచమ్మ గుడి వద్ద బోరు గ్రామపంచాయతీ నిధుల నుండి వేశారా, సొంత ఖర్చులతో వేశారా సమాధానం చెప్పాలని అడిగారు. ప్రజల నుండి వసూల్ చేసిన ఇంటి పన్నులు బిల్ కలెక్టర్ వద్ద నుండి ఎన్ని డబ్బులు ఎవరు తీసుకున్నారని, అవి జీపీ ఖాతాలో జమ చేశారా లేదా అని ప్రశ్నించారు. వసూలు చేసిన పన్నుల సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధి వద్ద ఎలా ఉంచుకుంటారని పలువురు నిలదీశారు. ఇకపై పాలకవర్గ సమావేశం, గ్రామసభ సమావేశం, ఎజెండా అంశాలను తమకు ముందుగానే సమాచారం ఇవ్వాలని వార్డు సభ్యులు తేల్చిచెప్పారు. సమావేశంలో ఉప సర్పంచ్ వినోద్, ఇంఛార్జి కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు, కొంతమంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

**సూర్య మల్లాపూర్**



మండలంలోని చిట్టాపూర్, రేగుంట, సిరిపూర్ గ్రామాల్లో గల పురుగుమందుల దుకాణాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య శు క్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పురుగుమందులకు సంబంధిత ధ్రువపత్రాలు కాలపరిమితి దాటడంతో సరైన పత్రాలు లేకపోవడం గుర్తించి చిట్టాపూర్ లింగారెడ్డి ఫర్టిలైజర్ లో రూ.1లక్ష యాభై వేలు, రేగుంట రాహుల్ ఫర్టిలైజర్ లో రూ.12,150, సిరిపూర్ రైతు డిపో సిరిపూర్ లో 4,500 విలువగల ఆయా పురుగుమందుల అమ్మకాలను నిలిపివేయాలని నోటీసు లు జారి చేసినట్లు తెలిపారు. డీలర్లు తప్పకుండా స్టాక్ బోర్డ్, స్టాక్ రిజిస్టర్ లను ప్రతి రోజు నమోదు చేయాలని,ప్రతీరైతుకు తప్పనిసరిగా నగదు బిల్ ఇవ్వాలని సూచించారు. బిల్లు లో రైతు సంతకాలు తీసకోవాలన్నారు. క్రయవిక్రయాలకు సంబంధించి ప్రతీ నెల 1వ తారీఖు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని తెలిపారు.

### బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన వివిధ పార్టీలకు చెందిన నాయకుల..

**సూర్య మల్యాల**




మల్యాల మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల చెందిన 20 మంది నాయకులు శుక్రవారం గంగాధర మండలం బూరుగుపల్లి బిఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం శ్రీనివాస్ అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికీ పార్టీ కండువా కప్పి పార్టీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ లో చేరిన నాయకులు,కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో విసుగు చెంది, గతం బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ నాయకులుతదితరులు పాల్గొన్నారు

## ఆర్జీ-2 డివిజన్ లో క్వార్టర్ ల కౌన్సలింగ్

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ ఆర్జీ-2 వ ఏరియా 8 ఇంక్లైన్ కాలనీ లోని సీఈఆర్ క్లబ్ లో శుక్రవారం ఎన్ సి డబ్ల్యూఏ గ్రూప్-1 ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. 212 క్వార్టర్ లకు నోటిఫికేషన్ వేయగా 107 మంది హాజరు కాగా 84 మందికి పారదర్శకంగా క్వార్టర్ లు కేటాయించినట్లు అధికార ప్రతినిధి అరవింద్ రావు ( ఏజీఎం పర్సనల్) తెలియజేశారు. ఈ కౌన్సిలింగ్ లో ఎస్ఓటు జీఎం మాలోత్ రాముడు, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవిందర్, డివైపీఎం వేణుగోపాల్, సివిల్ ఎస్ఈ ప్రతాపరాజు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్, జూనియర్ ఇన్ స్పెక్టర్ పిపి రాజయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీలేఖ, క్వార్టర్ సెక్షన్ గార్డ్ రాజ్ కుమార్, ఇంటెలిజెన్స్ గార్డ్ మహబూబ్ అలి, సేవా సమితి కన్వీనర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో గల సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ చైర్మన్ కోరికల సత్యనారాయణ గౌడ్, ఆలయ అర్చకులు రుద్రభట్ల జయంత శర్మ ఆలయ ఈవో రాజ్ కుమార్ తెలిపారు. మార్చి 1న తేదీల్లో శ్రీవారి కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు 2వ తేదీన శ్రీవారి కళ్యాణ మహోత్సవములు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మార్చి-02 వ తేదీన రథోత్సవం జరుగునని పేర్కొన్నారు. ధర్మకర్త మండలి సభ్యులు చింతల రాజిరెడ్డి, ధర్మకర్త నరేండ్ల శ్రీనివాసరావు, ధర్మకర్త జనగామ హేమలత, ధర్మకర్త మాటూరి సమ్మయ్య, ధర్మకర్త రేగుంట్ల రవి, గ్రామ ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. గోదావరిఖని నుంచి పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కలదని తెలిపారు.

## అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి నర్సింగరావు

**సూర్య కోరుట్ల**



కోరుట్ల పట్టణ ఆదర్శనగర్ లో గల శ్రీ అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో దేవాలయ సత్తమ్మ దశ వార్షికోత్సవ పంచాయితీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేసి శ్రీ అష్టలక్ష్మి సహిత శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తోపాటు కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంతా గంగాధర్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు చిట్యాల లక్ష్మీనారాయణ రెంజర్ల కళ్యాణి లక్ష్మీనారాయణ శిరీష సోగ్రాబి నాయకులు పుప్పాల ప్రభాకర్ సంఘ లింగం శ్రీనివాస్ ముత్యాల గంగాధర్ ఎడ్ల రమేష్ రంజిత్ ముత్యాల గంగాధర్ ఎలిశెట్టి భూమారెడ్డి వాసిద్ ఆలయ నిర్వాహకులు బూరుగు రామస్వామి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పదో తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం కనగర్తి, సుద్దాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులు శు క్రవారం పంపిణీ చేశారు. తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి అవధూత శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం సంకల్పంతో, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.50 లక్షల ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు "సరస్వతీ కటాక్షం" పేరుతో పెన్నులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.పెన్నులకు ముందుగా బాసర జ్ఞానసరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పెన్నులతో విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం--నానో ఎరువులపై రైతులకు శిక్షణ

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల మండలం నల్లగొండ రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏ టి ఎం ఏ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం మరియు నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మాళవిక అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. ట్రైకోడెర్మా వీరిడే, పీఎస్‌బీ (ఫాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా) వంటి జీవన ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యం



మెరుగుపడుతుందని వివరించారు.రిసోర్స్ పర్సన్ చంద్ర దీపక్ నానో ఎరువుల ప్రయోజనాలు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాళవిక మాట్లాడుతూరైతుల సంక్షేమమే గ్రామ అభివృద్ధికి పునాది అని అన్నారు. పెరుగుతున్న ఖర్చులు, నేల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు స్థిరంగా ఉంటాయని తెలిపారు.నానో ఎరువులు, జీవన ఎరువుల వినియోగంతో పంటలకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా అందుతాయని, భూమి సారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను రైతులు పూర్తిగా వినియోగించుకొని, కొత్త పద్ధతులను స్వీకరించి ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జి. శ్రీనివాస్, ఏఈఓ శ్రీలతతో పాటు రైతులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేద్దాం

**- పార్లమెంట్ కోఆర్డినేటర్ పెంటాల మహేష్**

**సూర్య సిరిసిల్ల టౌన్**




తెలంగాణ గడ్డపై ఉద్భవించిన జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం దేశ వ్యాప్తంగా ప్రారంభమైందని అ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మహేష్ పెంటల తెలిపారు.సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పెంటల మహేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ కార్యక్రమం కోసం తెలంగాణలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అడ్ హాక్, కోఆర్డినేటర్ లను నియమించారు.కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ గా మహేష్ పెంటలని జనసేన పార్టీ నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు,రాష్ట్ర నాయకత్వానికి,పార్టీ ప్రచార కార్యదర్శి ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఆర్ కే.సాగర్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల26 నుండి మార్చి 10వరకు ఉంటుందన్నారు.పార్టీ పెద్దల అదేశాలమేరకు నియోజకవర్గాల వారీగా సభ్యత్వం విజయవంతం చేయడం కోసం అడ్ హాక్ కమిటీని, సాదక్ లని నియమిస్తారని,సాదక్ లు సభ్యత్వ నమోదు కార్యక్రమంను ఊరురా తిరిగి విస్తృతంగా నిర్వహిస్తారు.పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తించి నాయకులుగా తీర్చిదిద్దే పద్ధతికి పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రవి కాంత్,వంగరి సాయి కిరణ్,సందిరి శ్రీకాంత్, నాంపల్లి విష్ణు,అల్లే శ్రీకాంత్,నెరేళ్ల నరేష్,మెడుదుల అనిల్ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున పోటీచేసిన అభ్యర్థులు నల్లా ప్రవీణ్, అన్నారం సాయికుమార్,సాగల జీవన్,దికొండ అశోక్,నాయకులు కట్ల సాయి,శ్రీకాంత్,ఎల్లం గౌడ్, లవణ్, భారత్,అరవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్ లో ప్లేవర్ ఫియస్టా-తెలంగాణ వంటకాల ఉత్సవం

**సూర్య కొత్తపల్లి, కరీంనగర్ రూరల్**



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ (గూ) డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఈరోజు ప్లేవర్ ఫియస్టా పేరుతో విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించడం జరిగింది .ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కే రామకృష్ణ ప్రారంభిస్తూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులలో ఆహారం పట్ల అవగాహన మరియు వివిధ ఆహార పదార్థాలలోని పోషకాహాలను సంబంధించిన సమాచారం అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ కు చెందిన విద్యార్థులు దాదాపు 60 రకాల వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె కిరణ్మయి వైస్ ప్రిన్సిపల్స్ టి. రాజయ్య, పి. నితిన్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి తో పాటు జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తోట మహేష్,డి రవీందర్రావు సమతా, ప్రీతి,చరణ్ మరియు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినందుకు జంతుశాస్త్ర విభాగాన్ని కళాశాల ప్రిన్సిపల్ మరియు ౧+జ+గూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి అభినందించారు.

## ములుగు జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**సూర్య - ఎలిగేడు**

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కలెక్టర్ గారి అనుమతితో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. కరీంనగర్ ప్రాంతీయ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలలలో 4వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 4వ తరగతిలో ప్రవేశం కోసం 01.09.2017 నుండి 31.08.2018 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు. దరఖాస్తు ప్రక్రియ 26 ఫిబ్రవరి 2026 నుండి 4 మార్చి 2026 వరకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడుతుంది. అభ్యర్థులు సాయంత్రం 5.00 గంటలలోపు అధికారిక వెబ్‌సైట్ tgss.telangana.gov.in లో నమోదు చేసుకోవాలి. మండల సాయి మార్చి13నుండి17 వరకు జరపబడతాయి. మండలస్థాయి ఎంపికైన వాళ్లు మార్చి 28న ఉదయం 9 గంటలకు పెద్దపల్లి ఐటీఐ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించబడతాయి. జిల్లా స్థాయి ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ఫైనల్ ఎంపికలు 27 ఏప్రిల్ 2026న నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:

ఆధార్ కార్డు (అసలు, జిరాక్స్)

ప్రస్తుత పాఠశాల బోనాఫైడ్ సర్టిఫికేట్ (అసలు, జిరాక్స్)

జనన సర్టిఫికేట్ (అసలు , జిరాక్స్)

3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ (అసలు,జిరాక్స్)

ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు

కుల/సమాజ ధృవీకరణ పత్రం (అసలు ఒ జిరాక్స్)

విద్యార్థుల ఎంపికకు అన్త్రోపోమెట్రిక్ కొలతలు (ఎత్తు, బరువు) మోటార్ నైపుణ్య నిర్వహించబడతాయి. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6ఐ10 మీటర్ల షటిల్ రన్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 1 కిలో మెడిసిన్ బాల్ పుట్, 800 మీటర్ల రన్ నిర్వహిస్తారు. అదనంగా స్కిల్ టెస్ట్ ఎడ్యుకేషనల్ టెస్ట్ ఉంటాయి.మండల విద్యా అధికారి తెలిపారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి అన్నారు. రామగిరి మండలం కలవచర్ల గ్రామంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రభుత్వం చే మహిళల కోసం నిర్వహించబడుతున్న కుట్టు మిషన్ శిక్షణ నిర్వహిస్తున్న నిర్వహణ అధికారులు కలవచర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి కి సన్మానం చేశారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షణ తరగతులను కలవచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మాట్లాడుతూ మహిళా సాధికారతే ముఖ్య ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను మహిళలందరూ ఉపయోగించుకోవాలని, అంతేకాకుండా తమ జీవనోపాధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పద్మ, ఎస్ ఈఆర్ పి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బి.శ్రీధర్, ఏంఎస్ఏంఏ కో-ఆర్డినేటర్ రేష్మ, విఓఏలు కనకలక్ష్మి, స్వప్న, ట్రైనర్స్ రమ, శ్యామల, శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.



## జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆవిష్కృత్-2026 పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

మార్చి 6,7 తేదీల్లో మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సాంకేతిక పండుగ ఆవిష్కృత్- 2026 పోస్టర్ ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. జూన్ 6న టెక్నికల్ ఫెస్ట్ లో భాగంగా టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. 7న సాంస్కృతిక కార్యక్రమాలు, కళాశాల వార్షికోత్సవం జరుగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఫ్లాష్ మ్యాబ్, మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, పోయెట్రీ కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, పరిపాలనాధికారి సుమన్, విద్యార్థి సమన్వయకర్తలు పి. సాయిచరణ్, చి.అరవింద్, జె.సాయి చరణ్, బి.అజయ్, ఎల్.నరేందర్, డి.భరత్, జె.వర్షిత, ఎం.నాగమల్లిక, కె.సమత, కె.గాయత్రి, ఎ.అను, సిహెచ్.సాత్విక, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి 17 వ డివిజన్ లో అభివృద్ధి పనులు ప్రారంభం

**సూర్య కొత్తపల్లి**



కొత్తపల్లి 17వ డివిజన్ లో అభివృద్ధి పనులను 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవితా చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పనులను నగరపాలక సంస్థ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు డి ఈ వెంకటేశ్వరరావు ఏఈ సతీష్ వర్క్ ఇన్స్పెక్టర్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 1న కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



రాష్ట్ర ప్రభుత్వం మరియు ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షను మార్చి 1వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏం. నాగైలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నుండి దరఖాస్తు చేసుకున్న 532 మంది అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసే సమయంలో అడిగిన నాలుగు వివరాలలో ఏవైనా రెండింటిని మాత్రమే నమోదు చేయాలని, అన్ని వివరాలు నింపితే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షకు అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, ఇతర వివరాల కోసం ఎస్సీ స్టడీ సర్కిల్ గౌరవ సంచాలకులు బండ శ్రీనివాస్ (9885218053)ను సంప్రదించాలని కోరారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పై వార్డు మెంబర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసిందని రామగిరి ఎంపిడిఓ బద్రి శైలజ రాణి, ఎంపీఓ మోతె సమ్మి రెడ్డి అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ రైతు వేదికలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు ఎంపిడిఓ బద్రి శైలజ రాణి, ఎంపీఓ మోతె సమ్మి రెడ్డి సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు ఏం.వేణుగోపాల్, బి.రాజేందర్, ఏ.రామ్మోహన్, బి.ప్రసాద్, సూపరింటెండెంట్ ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు, అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి కేంద్ర నిధులే బలమైన ఆధారం

## - కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన కోట్లాది రూపాయల విలువైన ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం నుంచి, ముఖ్యంగా నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎమ్) ద్వారా ప్రతి సంవత్సరం సగటున రూ.50 నుంచి 70 కోట్ల వరకు నిధులు అందుతున్నాయని తెలిపారు. ఈ నిధులే ఆస్పత్రికి ఊపిరి పోస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్టిపిసి సహకారంతో లాప్రొస్కోపీ



యంత్రాలు, ఈసీజీ, సిటిజి వంటి ఆధునిక పరికరాలను అందించామని, ఇంకా అవసరమైన పరికరాలను త్వరలోనే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో పీపీఈ కిట్ ధరించి ఆస్పత్రిని స్వయంగా సందర్శించి వైద్య సిబ్బందికి ధైర్యం చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ ఎంతో త్యాగంతో సేవలందించారని, గ్లౌజులు, మాస్కులు లేని పరిస్థితుల్లోనూ విధులు నిర్వర్తించారని అన్నారు. ఎంపీ నిధుల నుంచి అవసరమైన సామగ్రిని వెంటనే అందించి అనేక ప్రాణాలు కాపాడగలిగామని తెలిపారు. గతంలో పరికరాల కొరత కారణంగా పేద రోగులను ఇతర ప్రాంతాలు, ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆధునిక పరికరాలను అందించామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కరీంనగర్ జిల్లా ఆస్పత్రిని ఉత్తర తెలంగాణలో ఆదర్శవంతమైన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతానని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# కమనీయం... రమణీయం శ్రీనాగపెల్లి లక్ష్మి నరసింహుడి కళ్యాణం

## - వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం

**సూర్య వెల్లటూర్**

జగిత్యాల జిల్లా వెల్లటూర్ మండలంలోని కిష్టన్నావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో స్వయంభూగా వెలసిన శ్రీనాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన శ్రీలక్ష్మి నరసింహుడి కళ్యాణ మహోత్సవం నవ వైకుంఠాన్ని తలపించేలా అంగరంగ వైభవంగా జరిగింది. వధూవరులు నరసింహస్వామి అమ్మవారికి రత్నఖచిత,స్వర ఆభరణాలు ధరించి,రంగురంగుల పులమాలలతో అలంకరించిన కళ్యాణ మండపంలో వారి ఇరువురిని ఆశీనులు గావించి ఆలయ ప్రధాన అర్చకులు విష్ణు వర్ధనా చార్యులు వారి అర్చక బృందంతో మంత్రోచ్ఛారణలతో శాస్త్రనుసారం కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. నరసింహుడి అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ,జీలకర్ర బెల్లంధారణ,



కన్యదాన ఘట్టంతో అద్భుతంగా స్వామివార్ల కళ్యాణం నేత్రపర్వాంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తజనం పారవశ్యంతో పులకించారు.అనంతరం భక్తులు స్వామివారికి కట్నకానుకలు సమర్పించి,మొక్కులు తీర్చుకున్నారు.అంతకుముందు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పులమాలలతో అలంకరించి చిన పల్లకిలో ఉంచి గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుండి లక్ష్మి నరసింహుడి ఆలయం వరకు మహిళల మంగళ హారతులు, మంగళ వాయిద్య సొన్నాయిలు,మహిళల కోలాటాల మధ్య స్వామివారి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్,స్థానిక సర్పంచ్ కుమ్మరి సునీత-వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తరాల శివకుమార్, పాదం వెంకటేష్,అన్నమానేనిగజేందర్ రావు,కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్,బోగే ప్రేమసాగర్,ఉపసర్పంచ్ ఆల్లునూరి సతీష్,వార్డు సభ్యులు ఎల్లం నర్సయ్య, బక్కశెట్టి మహేష్,కుస శైలజ, ఇసనవేని నగేష్,కల్లు బుచ్చమ్మ,శేఖర్,భాగ్యలక్ష్మి, చెంద్యాల అనసూర్య,రామచందర్ రావు,గౌరు లక్ష్మీ నారాయణ,పులి ప్రశాంత్,వివిధ గ్రామాల ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

# 19 బిలియన్ క్యూబిక్ మీటర్ల కోల్ బెడ్ మిథేన్ అన్వేషణకు సింగరేణికి అవకాశం

## - వేలంలో పాల్గొనాల్సిందిగా కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల మంత్రిత్వ శాఖ ప్రతినిధుల సూచన

## - సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో ఏడీజీ సచివ్ కుమార్ భేటీ

**సూర్య సెంటినరీ కాలనీ**

బొగ్గు అన్వేషణ లో 13 దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు బొగ్గు పొరలలో ఉన్న మిథేన్ గ్యాస్ వనరుల అన్వేషణకు అవకాశం లభించనుంది. కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల మంత్రిత్వ శాఖ సింగరేణి ప్రాంతంలో గుర్తించిన మూడు ప్రధాన బ్లాక్ ల అన్వేషణలో పాల్గొనాల్సిందిగా ఆ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం సాయంత్రం సింగరేణి భవన్ లో సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతిని కలిసి కోరారు. దేశ వ్యాప్తంగా ఈ వాయువును ఉత్పత్తి చేయడానికి పలు రాష్ట్రాల్లో బ్లాక్ లను గుర్తించారని, దీనిలో ప్రాణహిత - గోదావరి లోయ ప్రాంతం కూడా ఉందని, దీనికి సంబంధించి ముందుగా అన్వేషణ జరపడానికి



త్వరలో కేంద్ర పెట్రోలియం శాఖ వేలం నిర్వహించబోతోందని తెలిపారు. సింగరేణి సంస్థ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీటిలో సింగరేణిలో ప్రాంతంలో ఆరు జిల్లాల్లో మూడు ప్రధాన బ్లాక్‌లను గుర్తించామన్నారు. వీటిలో మంచిర్యాల, పెద్దపల్లి, కొమురం భీమ్, ఒక బ్లాక్‌గా(5 బిలియన్ క్యూబిక్ మీటర్ల వనరులు ), భద్రాద్రి కొత్తగూడెంలో ఒక బ్లాక్ (2 బిలియన్ క్యూబిక్ మీటర్లు), భద్రాద్రి కొత్తగూడెం, ములుగు కలిపి ఒక బ్లాక్‌గా(12 బిలియన్ క్యూబిక్ మీటర్లు) గుర్తించారని, ఈ బ్లాక్ ల్లో అన్వేషణ జరపడానికి సింగరేణి సంస్థ త్వరలో జరిగే వేలంలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు. ఈ మూడు బ్లాక్ లలో దాదాపు 19 బిలియన్ క్యూబిక్ మీటర్ల మిథేన్ గ్యాస్ వనరుల లభ్యత ఉన్నట్లు ప్రాథమిక అంచనా ఉన్నట్లు తెలిపారు. వికసిత్ భారత్ - 2047 లో భాగంగా చమురు, ఇంధన రంగాలను స్వయం సమృద్ధిని సాధించడంలో ఇది ఒక అంతర్భాగ నిర్ణయంగా పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై కూలంకశంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్

# విద్యార్థులకు యూనిఫామ్ షూ, బెల్ట్ పంపిణీ

**సూర్య ఎండపల్లి**

ఎండపల్లి మండలంలోని పాత గూడూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల పూర్వ ప్రాథమిక విద్యార్థులకు రెండు జతల యూనిఫాం బెల్ట్,షూ, సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చింతపండు సేకరయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆంజనేయులు, చోటే మియా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాజారపు కావ్య, ఇన్స్ట్రక్టర్ ఆయాలు ఇందిరా మమతలు పాల్గొన్నారు.



# యువతికి 'ఇన్‌స్టా' వల..

## - ప్రేమ పేరుతో నగదు, నగలతో కేటుగాడు పరార్! - లాడ్జ్ యజమానిపై కేసు

## - వేములవాడలో వెలుగుచూసిన ఉదంతం

**సూర్య, వేములవాడ:**



సోషల్ మీడియా పరిచయాలు ఎంత ప్రమాదకరమో చెప్పే మరో ఘటన వేములవాడలో వెలుగుచూసింది. ఇన్‌స్టాగ్రామ్ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఓ యువతిని నమ్మించిన కిలాడీ దొంగ, ఆమె వద్ద ఉన్న బంగారం, నగదుతో ఉడాయించాడు.వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి పట్టణానికి చెందిన ఓ మహిళకు విజయవాడకు చెందిన వంశీ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మబలికి, వేములవాడలోని 'మహేశ్వరి పరమేశ్వర' లాడ్జ్‌కు తీసుకువచ్చాడు. అక్కడ గది అద్దెకు తీసుకున్న తర్వాత, బాధితురాలు బాత్రూమ్‌కు వెళ్లిన సమయం చూసి ఆమె బ్యాగ్‌లో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, రూ. 10,000 నగదును దొంగిలించి వంశీ పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

**- లాడ్జ్ యజమానిపై కేసు**

ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. సదరు లాడ్జ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధార్ కార్డులు లేదా గుర్తింపు పత్రాలు తీసుకోకుండానే గదిని కేటాయించినట్లు పోలీసులు గుర్తించారు. రిజిస్టర్ మెయింటెనెన్స్‌లో కూడా లోపాలు ఉండటంతో, నిర్లక్ష్యంగా వ్యవహరించిన లాడ్జ్ యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

**- లాడ్జి గెస్ట్ హౌజ్ నిర్వాహకులకు సీఐ హెచ్చరిక..**

లాడ్జ్, గెస్ట్ హౌస్ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ వీరప్రసాద్ ఆదేశించారు. ప్రతి అతిథి నుంచి ఒరిజినల్ ఐడీ కార్డులు తీసుకోవాలనీ, సీసీ కెమెరాలు నిరంతరం పని చేస్తూ ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనీ, నిబంధనలు పాటించని పక్షంలో ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# అరైవ్ అలైవ్ కార్యక్రమంలో 210 మంది డ్రైవర్లకు ఉచిత వైద్య, కంటి పరీక్షలు

**సూర్య కోరుట్ల**

పట్టణంలో శుక్రవారం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆధ్వర్యంలో లారీ, డీసీఎం, కార్, ఆటో మరియు అంబులెన్స్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఉచిత కంటి మరియు సాధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కోరుట్లకు చెందిన వైద్యులు డా. రేగొండ రాజేష్, డా. సంపత్ కుమార్, డా. సుమన్, అలాగే రేణి హాస్పిటల్‌కు చెందిన డా. సమీర్ తమ సేవలను అందించారు. కోరుట్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీవన్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మారెడ్డి సహకారంతో ఈ శిబిరం విజయవంతమైంది. మొత్తం 210 మంది డ్రైవర్లకు కంటి మరియు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అందులో 160 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఐదుగురు వ్యక్తులకు అవసరమైన శస్త్రచికిత్సల కోసం లయన్స్ క్లబ్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన వైద్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులను ఎస్పీ సన్మానించారు.కార్యక్రమంలో మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు, కోరుట్ల సీఐ బి. సురేష్ బాబు, మెట్పల్లి సీఐ అనిల్ కుమార్, కోరుట్ల ఎస్సైలు ఎం. చిరంజీవి, రామచంద్రం, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్సై రవి కిరణ్, కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# చదువు తోనే ఉజ్వల భవిష్యత్తు

## - అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు

## - క్రోమ కార్నివాల్ నోబెల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

**సూర్య - పెద్దపల్లి రూరల్**

చదువు తోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మండలం లోని పెద్దకాలవల లో నోబెల్ పాఠశాల కరస్పాండెంట్ మోహన్ రాజా ఆధ్వర్యంలో క్రోమ కార్నివాల్ 2026 నోబెల్ పాఠశాల 15 వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ను ప్రారంభించారు. కరస్పాండెంట్ మోహన్ రాజా, ప్రిన్సిపల్ ప్రణీత లు ముఖ్య అతిథిగా వచ్చిన వారిని మెమెంటో తో పాటు శాలువ కప్పి సన్మానం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్తు తల్లిదండ్రుల పైన ఆధారపడి వుంటుంది. వారిని




గమనించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కు నోబెల్ విద్యార్థులు మంచి పేరు తీసుకోవాలని ఆకాంక్షించారు. చదువు తో పాటు క్రీడలలో రాణించాలని సూచించారు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలని అన్నారు. ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ పిల్లలకు ఒకప్పుడు సెల్ ఫోన్, సోషల్ మీడియా లేవు వినేవారు , ఇప్పుడు తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు. వారి ప్రవర్తన గమనించాలి అన్నారు. పిల్లలకు మంచి, చెడు లు తెలియజేయన్నారు. కుటుంబ విలువలు, సామాజిక విలువలు తెలిపి చదువు తో పాటు వివరించాలి. క్రమశిక్షణ , నిరంతర ప్రయత్నం తో పిల్లలు అభివృద్ధి చెందుతారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీవో జిల్లా అధ్యకులు బొంకురి శంకర్, మండల విద్యాధికారి సురేందర్ కుమార్, డి సి ఈ బి సెక్రటరీ హనుమంతు, సర్పంచ్ పోలు కనకమ్మ రాజు , ఉప సర్పంచ్ లక్ష్మీ శంకర్, హెచ్ ఎం ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి ఎన్నారై చేయూత

**సూర్య చందుర్తి**

సొంతూరి పై మమకారంతో ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారు ఎన్నారై తిప్పని నరేష్ తండ్రి లచ్చయ్య గ్రామంలో నూతనంగా నిర్మించనున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు ఆర్థిక చేయూతనిచారు.గ్రామస్తులు ఐక్యమత్యంతో ఆలయ నిర్మాణం చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామస్తులు పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ పోతరాజు భారతి నాగేశం ఉప సర్పంచ్ వేణు గ్రామస్తులుఉన్నారు

## మహాశివరాత్రి స్పెషల్ డ్యూటీ నిర్వర్తించిన ఎన్పీడీసీఎల్ సిబ్బందికి సత్కారం

**సూర్య కరీంనగర్ టౌన్**



కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో గురువారం సర్కిల్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) వరంగల్ టి. మధుసూదన్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ భీమేశ్వర ఆలయం మరియు పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 14 నుండి 16 వరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు స్పెషల్ డ్యూటీ నిర్వహించిన సిబ్బందిని అభినందించారు.సీఈ (ఓపి) వరంగల్ వి. అశోక్, ఎస్ఈ వి. గంగాధర్ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను మెమెంటోలు అందజేసి సన్మానించారు. రాబోయే పండుగలు, ఇంటర్ మరియు ఎస్ఎస్సి పరీక్షల సమయంలో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ సూచించారు.సమావేశంలో డిఈలు ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, ఎం. తిరుపతి, చంద్రమౌళి, రమణారెడ్డి, ఎస్ఏఓ రాజేంద్రప్రసాద్, ఏవోలు, ఏఏఓలు, ఏడీఈలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మల్యాల ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగాఆత్మీయ వీడ్కోలు

**సూర్య మల్యాల**




మల్యాల ఎక్స్ రోడ్లో గల ఆల్ఫోర్స్ (ఎస్ ఎస్ వి) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ, 9వ తరగతి విద్యార్థుల కోసం "సారంగ్" పేరుతో ఆత్మీయ వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి, మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి రావాలంటే జీవితంలో క్రమశిక్షణ ను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా మెలగాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థు లు తమ పాఠశాల అనుభవాలను, మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. జూని యర్ విద్యార్థులు సీనియర్లకు పాటలు, నృత్యాలతో అలరించి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా తీర్చిదిద్దారు. అనంతరం చైర్మన్ నరేందర్ రెడ్డి ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవాలయానికి ఉత్సవ రథాన్ని బహుకరించిన కౌన్సిలర్ దంపతులు

**సూర్య కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయంలో శుక్రవారం భక్తి పరవశ వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలాల సాయిచంద్ రాధ 25వ వార్డు కౌన్సిలర్ దేవాలయానికి రూ. 1.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఉత్సవ రథాన్ని వితరణ చేశారు. ఉత్సవ రథాన్ని పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్, దేవాలయ కమిటీ చైర్మన్ జిల్లా ధనంజయ్ ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య రథాన్ని దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలాల సాయి చంద్ మాట్లాడుతూ, "నెల రోజుల క్రితం ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు ఉత్సవ రథాన్ని సమర్పించడం నాకు ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. శివయ్యకు అమ్మవారికి ఈ విధంగా సేవ చేసే అదృష్టం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా అని తెలిపారు.దేవాలయ ఉత్సవాల్లో ఈ రథం కీలక పాత్ర పోషించనుందని, భక్తుల ఆధ్యాత్మిక భావనను మరింత బలపరుస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బండ్ల రవి కుమార్, ఆడెపు నరేష్, జక్కుల ప్రవీణ్, కట్కం వినయ్, అందె రాజ్ కుమార్, రుద్ర విఘ్నేష్, రాడం మహేందర్, గజేంగి మనీష్, బండి సురేష్, అందె రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం

**సూర్య మల్లాపూర్**



మండలంలోని రాఘవపేట్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవ స్థాపకులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజనమ్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపి ముత్యాల తలంబ్రాలతో వేదమంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా కళ్యాణ ఘట్టాన్ని పూర్తి చేసి నాగవెల్లి కార్యక్రమం జరిపారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకిం చేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఎదులపురం నారాయణ, నాయకులు నర్సయ్య, రవికుమార్ యాదవ్, రాకేష్ యాదవ్, లక్ష్మణ్, రాజేందర్, స్థానిక నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## జాజిరి హోళీ వేడుకలలో చిన్నారులు

**సూర్య సెంటినరీ కాలనీ**



గ్రామాల్లో హోలీ వేడుకలు ప్రారంభం అయ్యాయి. మార్చి-04 వ తేదీన హోళీ జరుపుకోనున్నారు. ఈ క్రమంలో గ్రామంలో చిన్నారులు కోలాటాలు పట్టుకొని జాజిరి ఆటలు ఆడుతున్నారు. ఇంటికి ఇంటికి వెళ్లి జాజిరి పాటలు, హోలీ పాటలు పాడుతున్నారు. తమకు తోచిన సహాయం అందించాలని కోరుతున్నారు.

## కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో శైలజ రాణి

**సూర్య సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం పన్నూరు గ్రామంలోని కే.జీ.బీ.వి పాఠశాల ను ఎంపిడిఓ బద్రి శైలజ రాణి తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఎంపిడిఓ బద్రి శైలజ రాణి కే.జీ.బీ.వి పాఠశాలను భోజన సమయం లో సందర్శించి ఫుడ్ నాణ్యత ను, కిచెన్ లో పరిశుభ్రత ను, టాయిలెట్స్ ను, స్టోర్ రూమ్ ను, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. అదే విధంగా కిచెన్, డైనింగ్ హాల్ కు సంబంధించి జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

**సూర్య మల్లాపూర్**

మండలంలోని మొగిలిపేట గ్రామంలో హైందవ స్వరాజ్య సేన ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో హైందవ స్వరాజ్య సేన అధ్యక్షులు గడ్డం ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు పిట్ల సాయిరాం, క్యాషియర్ మాసుల రాకేష్, నైనేని లక్ష్మణ్, గొల్లపత్తిని విజయ్, ముద్దురి ప్రకాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం

**- ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపిడిఓ కొప్పుల శ్రీనివాస్ అన్నారు. మండలం లోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో రెండో విడత లో శిక్షణ కు హాజరైన వార్డు సభ్యులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలన చట్టం లో వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అలాగే పరిశుద్య నిర్వహణ, ఉపాధి హామీ పనులు, మొక్కల పెంపకం , వీధి దీపాలు ఏర్పాటు, అభివృద్ధి పనులను రికార్డు చేయాలని అన్నారు . విధి గా జనరల్ బాడీ సమావేశం కు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల రోజారాణి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో
# క్రీడలను ప్రోత్సాహం అందిస్తున్న'ఈతరం'యూత్ క్లబ్
### - మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్

**సూర్య ఇల్లంతకుంట**

గ్రామీణ ప్రాంత క్రీడలైన కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో మళ్ళీ గ్రామాల్లో క్రీడలు నిలవాలి, క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి అనే ఆలోచన పెట్టి ప్రతి యేడు క్రీడలను నిర్వహిస్తు, క్రీడాకారులను తయారు చేయడం గాలిపల్లి 'ఈతరం యువజన సంఘం'పునాది కావడం సంతోషకరమని మాన కొండూరు మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాల కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో ఈతరం యువజన సంఘం ఆధ్వ ర్యంలో ఉమ్మడి జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడపోటీల ప్రారంభోత్సవ సమావేశం సంఘ అధ్యక్షులు ఎస్పీ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి, జడ్పి మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి లు మాట్లాడారు. క్రీడాకారులు




క్రీడా స్ఫూర్తితో మెదలాలని, క్రీడలవల్ల గ్రామా నికి, మండలానికి గుర్తింపు వస్తుందన్నారు. గ్రామీణ క్రీడలతో క్రీడల్లో రాణించిన క్రీడా కారులు ప్రభుత్వ పలు శాఖల్లో ఉద్యోగాల్లో వున్నారన్నారు. ఉమ్మడి జిల్లా నుండి కబడ్డీ-వాలీబాల్ క్రీడల జట్లు 70 పైగా పాల్గొంటున్నట్లు కమిటీ తెలిపింది. ఈ సమావేశంలో జడ్పి మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు,సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి, జవారిపేట ఉప సర్పంచ్ అన్నాడి మహేం దర్ రెడ్డి,పారువెల్ల గ్రామ మాజీ సర్పంచ్ మోహా న్ రెడ్డి,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు మేకల పావ ని,కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్ రావు, ఈతరం యువజన సంఘ వ్యవస్థాపకులు, మాజీ అధ్యక్షులు ఏంద్ర నారాయణ,ఉపాధ్యక్షులు ఏంద్ర పవన్, ప్రధానకార్యదర్శి పిల్లి వేణు, కార్య దర్శి వర్కోలు సంతోష్,సహాయ కార్యదర్శి కుం భం రాజు, కోశాధికారి అర్కుటి ఎల్లయ్య,పి ఇ టి లు సానా బాబు,మామిడి శ్రీనివాస్,వివిధ గ్రామా ల క్రీడాకారులు, సంఘసభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ వాణి స్కూల్‌లో ఘనంగా వన్ లెర్న్ డే, నేషనల్ సైన్స్ డే నిర్వహణ

**సూర్య ఇల్లంతకుంట**



మండల కేంద్రమైన ఇల్లంతకుంట శ్రీ వాణి హై స్కూల్‌లో వన్ లెర్న్ డే, నేషనల్ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు సబ్జెక్టు లకు సంబంధించిన ప్రాజెక్టులను తయారు చేసిన ప్రదర్శనను తిల కించిన అనంతరం మండల విద్యా ధికారి చెప్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం ద్వారా విద్యా ర్థుల్లో దాగి వున్న ప్రతిభ, సృజనాత్మకత విలువలతో కూడిన విద్య అందు తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గణ గోని శ్రీకాంత్, ప్రిన్సి పాల్ కొయ్యడ సత్యనారాయణ,తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, శిల్ప, తిరుమల, లావణ్య, రాజు, రేణుక, అనిత, మౌనిక, స్వర్ణ, సుప్తు, రేష్మ, బాబు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో మూడవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**సూర్య జగిత్యాల అర్బన్**

జగిత్యాల జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రా ల్లో నిర్వహించడం జరిగింది.జనరల్ కోర్సులకు సంబంధించి 6750 విద్యా ర్థులకుగాను 6614 విద్యార్థులు హాజరు కాగా 136, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1142 విద్యార్థులకు గాను 1057 హాజరు కాగా 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 97.19% విద్యార్థులు పరీక్షలు రాశారు.జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత రాయికల్‌లోని ప్రణతి జూని యర్ కళాశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ స్పెషల్ అబ్జర్వర్ కూడా జిల్లాలో ఆరు సెంటర్లను పరిశీలించారు.జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనవుతున్నవారు టెలి మానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416 కి ఫోన్ చేసిమానసిక వైద్యుల సహాయం పొందగలరని జిల్లా పరీక్షల కన్వీ నర్ బి. నారాయణ తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం

**- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు**

**సూర్య రుద్రంగి**



రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్య మని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో ఆరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా రుద్రంగి పోలీస్ ఆధ్వర్యంలో యువకులకు రోడ్డు ప్రమాదాల నివారణపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రజల్లో, యువకుల్లో రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. గత సంవత్సరంలో రుద్రంగి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటె రాములు కొడుకు కంటె రెడ్డి తన తండ్రి అకాల మృతితో కుటుం బానికి ఏ విధంగా నష్టం జరిగిందో యువకులకు వివరించారు. ఈ కార్య క్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు దయ్యాల కమలాకర్, ఎఎస్ఐ గంగారాజు, పోలీస్ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలకు భూమిపూజ

**- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం జువ్వాడి**

**సూర్య మల్లాపూర్**



గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలం లోని ముత్యంపేట్ గ్రామంలో ఒక్కో భవనాన్ని 10లక్షలతో నిర్మించే మూడు గ్రామైక్య సంఘ భవనాలు, నూతన గ్రామపంచాయతి భవన నిర్మాణానికి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఎలాల జలపతి రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధి కొరకు మహిళలు ఆర్థికంగా ఎదగడానికై ప్రజాపాలన ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు నరేష్, ఉపసర్పంచ్ వంగ పోతయ్య, ఏపిఎం విమోచన, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి అనంద్ గౌడ్, మరిపెల్లి మల్లయ్య, బొల్లం రఘు, లక్ష్మా రెడ్డి, అల్లూరి మహేష్, వాకిడి భూమ రెడ్డి, సీఎఎల్ లయ, జ్ఞానేశ్వర్, రాజు, అధ్యక్షులు సాహితి, సులోచన, లక్ష్మీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పెద్దయ్య స్వామి బొట్టు పంపిణీ...

**- చీడపీడ వడగండ్ల వాన నుండి స్వామి రక్షిస్తాడని రైతుల మొక్కులు**

**సూర్య బోయినపల్లి**



మండలం తడగొండ గ్రామ రైతు లు ప్రతి సంవత్సరం లానే ఈ సంవత్సరం యాసంగి పంట పొలాలు వేసిన తర్వాత చీడపీడ వడగండ్ల వాన నుండి పెద్దయ్య స్వామి రక్షించాలని పసుపు కుంకు మ బొట్టు తెచ్చి గ్రామంలోని రైతులకు పంపిణీ చేసి పొలాల్లో చల్లుతారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దండేపల్లి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో పెద్దయ్య-చిన్నయ్య దేవాలయం ఉంది. ద్వాపర యుగంలో పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు ఈ కొండల్లోనే ఉండేవారని ప్రతీతి. పెద్దయ్య అంటే ఇక్కడ ధర్మరాజు.. అందుకే గుడిని పెద్దయ్య గుడిగా, గుట్టను పెద్దయ్య గుట్టగా పిలుస్తారు. భీముడు గోండుల ఆడపడుచు హిడిం బిని పెళ్లి చేసుకోవడంతో ఈ ప్రదేశాన్ని పెండ్లి మడుగుగా పిలుస్తారు. అర్జునుడి పేరు మీద అర్జుగూడ..ఈ గుట్టకు కొంత దూరంలో అర్జున లొద్ది నీటి గుండం కూడా ఉంది. సహదేవుని పేర వెలిసిన సామగూడ కూడా ఇక్కడ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,కుల సంఘాల నాయకులు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర నాయకుని జన్మదిన వేడుకలు

**సూర్య ఎండపల్లి**



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయ కులు, మాజీ సింగిల్ విండో ఛైర్మెన్,మద్దుల గోపాల్ రెడ్డి, జన్మదినం సందర్భంగా ఎండపల్లి మండలం, పలు గ్రామాల సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, పేరుతో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవ స్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఆయనపై ఉండాలని వారు ఇంకా ఎంతో ప్రజా సేవ చేసే అదృష్టాన్ని, అవకాశాన్ని వారికి అందివ్వాలని కోరుతూ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో ఎండపల్లి మండల సర్పంచు ల ఫోరం అధ్యక్షులు రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంగ రమేష్, గొడిసె లపెట్ గ్రామ సర్పంచ్ కండికట్ల అమృత రాజేష్, పడిదం లావణ్య మొగిలి, గొల్లపల్లి మల్లేశం, జేరిడ్డి మహేందర్ రెడ్డి, బెద్దల ప్రవీణ్,దర్శనాల నరేష్ కోడిపెల్లి కొమురమ్మ శ్రీనివాస్, బాలసాని శారద మల్లేశం,ఆవుల మమత తిరుపతి శనబండ సర్పంచ్ భాస్కర్ సింగిరెడ్డి లింగారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన హౌసింగ్ డీఈ

**సూర్య జగిత్యాల**



జగిత్యాల హౌసింగ్ డిఈగా నూత నంగా నియామకం అయిన సత్య నారాయణ శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌ని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వెంట పిడి ప్రసాద్, ఎఈ భార్గవ్ ఉన్నారు.

## అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలి

**- మాజీ ఉపసర్పంచ్‌ల మండల ఫోరమ్ అధ్యక్షులు ఎండి.సాదుల్**

**సూర్య ఇల్లంతకుంట**



మండల కేంద్రమైన ఇల్లంత కుంటలో అసంపూర్తిగా వున్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఇల్లంతకుంట మండల ఉప సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు ఎండి సాదుల్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివేకానంద స్వామీ చౌరస్తా నుండి వంతడుపుల బైపాస్ రోడ్డు విస్తరణ పనులు కొన్ని నెలలుగా నత్త నడకన కొనసాగుతున్నాయ న్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యగా పనులు చేస్తూ రోడ్డును బ్లాక్ చేస్తున్నాడని, రోడ్డు పై ఇసుక, కంకర లాంటి పనిసామాగ్రిని కూడా తొలగించకుండా ఒక వైపు రోడ్డు మొత్తం వాహనాలు వెళ్లకుండా ఉందని, ఒకే వైపు ఎదు రెదురుగా వాహనాలు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.అదే దారిలో కరీంనగర్ నుండి వచ్చే ఆర్టీసీ బస్సులకు, పెద్ద వాహనాలకు ఒకే వైపు వెళ్లడం వల్ల వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పా రు.ఈ రహదారి నుండే అధికారులు వస్తుంటారన్నారు. అధికారులు చొరవ తీసుకొని పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా నూతన కలెక్టర్ చిత్రా మిశ్రా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**







కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. అలాగే ఆర్‌డబీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.

# విద్యారంగ అభివృద్ధికి సీఎం విశేషంగా కృషి

## - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సూర్య, రాయికల్**

స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా వుంటూ విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో 12 లక్షల నిధులతో అంగన్వాడి నూతన భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తున్నాయని, పేద మధ్య తరగతి ప్రజల పిల్లలు ప్రైవేట్ ప్లే స్కూల్ తరహా మౌలిక సదుపాయాలు నాణ్యమైన బోధన కల్పించే విధంగా అంగన్వాడిల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వంతో కలిసి పని చేసి గ్రామాల అభివృద్ధి



కి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. రైతులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని,రైతు భరోసా నిధులు త్వరలో విడుదల చేస్తామని అన్నారు.ఏకకాలంలో 21వేల కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు.విద్యతో సామాజిక అసమానతలు తొలగుతాయని,ఎవరు దోచుకోనిది విద్య మాత్రమేనని విద్యా శాఖ మంత్రిగా ముఖ్యమంత్రి విద్య రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.ఈ జి ఎస్ పేరు మార్చి నిబంధనలు కఠినతరం చేయటం వల్ల తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని,రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజా ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపటాలన్నారు.గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనుల విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి,పంచాయతీ రాజ్ డీఈ. మిలింద్, ఏఈ ప్రసాద్, ఎంపీవో సుష్మా,సర్పంచ్ అంజా గౌడ్,ఉప సర్పంచ్ చాంద్ పాషా,మాజీ సర్పంచ్ గోపి,రమేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తిరుపతి గౌడ్,మాజీ ఎంపిటిసి గంగాధర్,మాజీ కో ఆప్షన్స్ ముఖీద్, సీడీపీఓ మమత,నాయకులు కోల శ్రీనివాస్, ఏనుగు మల్లారెడ్డి,మోహన్,ఆది రెడ్డి,వెంకన్న,శేఖర్ గౌడ్,శ్రీనివాస్,మండల,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంత్ రవిదాస్ ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త

## - సామాజిక సమరసత బాధ్యులు రమేష్ రెడ్డి, పుల్లూరి రామారావు

**సూర్య కరీంనగర్**

సంత్ రవిదాస్ 15-16వ శతాబ్దపు గొప్ప భక్తి ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త అని సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత బాధ్యులు పుల్లూరి రామారావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి కొనియాడారు.సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ యొక్క పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కాశీలో చర్మకారుల కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాస్ ముఖ్యంగా కులం, మతం, లింగ బేధాలను వ్యతిరేకించారని, మనుషులందరూ సమానమని, తన భక్తి గీతాలు, అద్వైత బోధనలతో, భగవంతుడు ఒక్కడే అని సమానాత్వాన్ని బోధించారన్నారు. సంత్ రవిదాస్



రాసిన భజనలు, శ్లోకాలు, సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంద్ సాహిబ్లో చోటు చేసుకున్నాయన్నారు.భక్తితోనే దేవుణ్ణి చేరుకోవచ్చనీ సంత్ రవిదాస్ అనేక భక్తి గీతాలు, ఆధ్యాత్మిక కవిత్వం భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మనలోనే దేవుడు ఉన్నాడని ఆయన చాటి చెప్పారని, ఆయన బోధనలు నేటికీ ప్రజలను ప్రేరేపిస్తున్నాయన్నారు. రవితేజ జయంతిని మాఘ పౌర్ణమి రోజున ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి, తెలంగాణ ప్రాంత భాద్యులు పుల్లూరి రామారావు,పురుషోత్తం,దావు సంతోష్ కుమార్, చంద్రగిరి సత్తయ్య, దొంతుల మల్లేశం, దొంతుల శ్రీనివాస్, దేవరకొండ సునీల్, సుందరగిరి సందీప్, దేవరకొండ నరేష్ బాబు, దేవరకొండ చంద్రమోహన్ అలిసేరి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**- జిల్లాలో మూడవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం**
**- జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత**

**సూర్య, రాయికల్**

జగిత్యాల జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత తెలిపారు.రాయికల్ లోని ప్రణతి జూనియర్ కళాశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి,ఏర్పాట్లను,పరీక్ష జరుగుతున్న తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్ కోర్సులకు సంబంధించి 6750 విద్యార్థులకు గాను 6614 విద్యార్థులు హాజరు కాగా 136 ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1142 విద్యార్థులకు గాను 1057 హాజరు కాగా 85 మంది విద్యార్థులు



గైర్హాజరయ్యారని, మొత్తంగా 97.19% విద్యార్థులు పరీక్షలు రాశారని ఆమె తెలిపారు. అలాగే జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లవుతే,టెలి మానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416కి ఫోన్ చేసి మానసిక వైద్యుల సహాయం పొందగలరని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.వీరి వెంట మండల రెవిన్యూ అధికారులు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులను అభినంధించిన ఎమ్మెల్యే

**సూర్య,రాయికల్**



రాయికల్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్కు చెందిన విద్యార్థులు సీఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీలలో రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనభర్చినందుకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ వారిని అభినందించారు. పాఠశాలకు చెందిన పి. కృష్ణ గోల్డ్ మెడల్, ఆర్.అక్షయ్ సిల్వర్ మెడల్ సాధించారు.జి. మనోజ్, ఆర్ మనింద్ర జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచారు.ఈ విద్యార్థులను జగిత్యాల జిల్లా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ మోర సుమన్,పాఠశాల ప్రిన్సిపాల్ జే వేణుగోపాల రావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, కోచ్ రామానుజన్, సంతోష్లు పాల్గొన్నారు.

# ఐ.ఎన్.టి.ఎస్. వోలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



2025-26 విద్యా సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షలో జగిత్యాల చైతన్య హై స్కూల్ -2 వ బ్రాంచ్ 46 మంది విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ టి.సచిన్, వైస్ ప్రిన్సిపాల్ సారిక, డీన్ నిరోషా అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య ఎం.జి.ఎం,ఎం రాజు, రాష్ట్ర సమన్వయకర్త జయరాజ్, కరీంనగర్ కోఆర్డినేటర్ పి.ప్రవీణ్,ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

# పారువెల్లలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన

**సూర్య గన్నేరువరం**



కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో దుబ్బపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న లోలెవెల్ బ్రిడ్జి కారణంగా వర్షాకాలంలో రెండు మూడు నెలలు ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. పీఎంజీఎస్వై పథకం కింద కిలోమీటరు నర రహదారి మంజూరు ప్రక్రియలో భాగంగా బ్రిడ్జి నిర్మాణ అవసరాన్ని ఎన్ఐటీ ప్రొఫెసర్ రాజేష్ కుమార్, ఎస్. శంకర్ (ఎన్ఐటీ వరంగల్), పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వరద మట్టాలు, బ్రిడ్జి అవసరం వంటి అంశాలపై స్థానిక రైతులను అడిగి వివరాలు సేకరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలికంగా నాణ్యమైన బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వంతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్డీఈ మంజుల భార్గవి, రవి ప్రసాద్, స్పెషల్ ఏఈ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ లక్ష్మీరామిరెడ్డి, ఉపసర్పంచ్ సిహెచ్ తిరుపతి, అల్వాల కోటి, బద్దం తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు సిహెచ్ మంగ మధుసూదన్ రెడ్డి, బండి పెల్లి సంతోష్, లచ్చిరెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాల మధ్య వివేకవర్ధిని వార్షికోత్సవ వేడుకలు

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్ 30 వసంతాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి పిల్లల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు హాజరై మాట్లాడుతూ...30 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తూ విద్య రంగానికి పాఠశాల యాజమాన్యం చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ హుజురాబాద్ లో పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తయారు చేస్తు తమ సంస్థను కొనసాగిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సహంతో విద్యా రంగానికి మరింత సేవలను అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా పలువురికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్లో బంగారు పతకాలు



**సూర్య కరీంనగర్**

ఎస్ఓఎఫ్ నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గణితశాస్త్రంపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయాలు సులభమవుతాయని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు: 3వ తరగతి-వశ్విత అక్షయ; 4వ తరగతి-ఎస్.అయాన్, జతిన్ సిద్ధార్థ, వి.తేజస్; 5వ తరగతి-పి. మయాంక్ రెడ్డి, పి. రిత్విక్ రెడ్డి, పి. సాద్విని; 6వ తరగతి-బి. కార్తికేయ గౌడ్, కే. క్రిసిక్ ప్రిన్స్, కే. సమర్థ్; 7వ తరగతి-బి. స్నితిక్, జి. సాయి ప్రణవి, జి. సహాన్స్ తదితరులు ఉన్నారు విజేతలకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాయికల్ మండల వార్డ్ మెంబర్ ఫోరమ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య, రాయికల్**



రాయికల్ మండలం వార్డ్ మెంబర్ ఫోరమ్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది.ఈ కార్యవర్గంలో మండల వార్డ్ మెంబర్ ఫోరమ్ మండల అధ్యక్షుడిగా నిగ భుమేశ్వర్,ఉపాధ్యక్షుడిగా జక్కుల పృధ్విరాజ్,ప్రధాన కార్యదర్శిగా అయిలవేని నరేందర్, క్యాషియర్ గా తునికి రంజీత్,మండల వార్డ్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వార్డ్ మెంబర్ ఫోరమ్ అధ్యక్షులు ధ్రువీకరణ్ పత్రం అందజేశారు.

# మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ - రూ.14.20 లక్షలతో మరింత విస్తృతంగా రంజాన్ పండుగ ఏర్పాట్లు**
**- నగర మేయర్ మహంకాళి స్వామి**

**సూర్య-గోదావరిఖని**



తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపడుతూ మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది అని రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రంజాన్ పర్వదినం సందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లపై రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ మహంకాళి స్వామి అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులు, మజీద్ కమిటీ ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం పట్టణం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీ ప్రాంతాల్లోని అన్ని మజీద్ లు, ఈద్గాల వద్ద రంజాన్‌కు అవసరమైన ఏర్పాట్లు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టాలని చెప్పారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థల సహకారంతో టెంట్లు, కార్పెట్లు, మంచి నీరు, జనరేటర్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి మజీద్‌లు, ఈద్గా ల అభివృద్ధి పనులు, ఫంక్షన్ హాల్స్ నిర్మాణం, కబ్రస్తాన్‌లలో వసతుల కల్పన చేపట్టినట్లు వివరించారు. అవసరమైన అదనపు వసతుల పై మత పెద్దలు సూచనలు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గత సంవత్సరం రూ.12.50 లక్షలతో రంజాన్ ఏర్పాట్లు చేసినట్లు, ఈసారి రూ.14.20 లక్షలతో మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థల ప్రభావిత ప్రాంతాల్లో కూడా సమగ్ర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మైనారిటీ యువత ఉపాధి అవకాశాల పెంపు దిశగా ఎమ్మెల్యే అసెంబ్లీలో చేసిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద "ఇ-స్కూటర్" పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. రూ.1,50,000 విలువైన ఈ-స్కూటర్‌కు లబ్ధిదారు వాటా రూ.30,000 చెల్లిస్తే, మిగిలిన రూ.1,20,000ను మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న నిరుద్యోగ మైనారిటీ యువకులు మార్చి 1 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలను నగర పాలక సంస్థ మెప్మా విభాగంలో సమర్పించాలని సూచించారు. ఓలా, రాపిడో, ఊబర్ వంటి రవాణా సంస్థలతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.రామన్, సింగరేణి ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, ఎన్టీపీసీ అధికారి సూర్య నారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ సీనియర్ మేనేజర్ వెంకటరెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏ.ఇంద్రసేనారెడ్డి తదితరులతో పాటు పలువురు కార్పొరేటర్లు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రక్త క్యాన్సర్ కేసులకు అత్యాధునిక వైద్య సేవలతో చికిత్స

**- యశోద ఆసుపత్రి కన్సల్టెంట్ మెడికల్, హీమటో ఆంకాలజిస్ట్ వంశీ కృష్ణ రెడ్డి**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



రక్త క్యాన్సర్ కేసులకు నిపుణులైన వైద్య బృందాల ద్వారా అత్యాధునిక వైద్య సేవలతో చికిత్సను అందిస్తున్నట్లు హైదరాబాద్‌లోని మలక్పేట్ యశోద ఆసుపత్రి కన్సల్టెంట్ మెడికల్, హీమటో ఆంకాలజిస్ట్ వంశీ కృష్ణ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరుపేదలకు హైదరాబాద్ లోని మలక్పేట్ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మెడికల్, హీమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ జి. వంశీ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యంగా అత్యంత ప్రమాదకరమైన రక్త క్యాన్సర్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. మనుషుల్లో తీవ్రమైన ప్లేట్లేట్ లోపంతో రక్త క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. దీనిని సకాలంలో గుర్తించి తక్షణమే చికిత్స అందించని పక్షంలో తీవ్రమైన రక్త స్రావాలు, సంక్రమణలు, అవయ వైకల్యం వంటి ప్రాణాంతక సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంన్నారు. నివారణ కోసం ఆధునిక ఆంకాలజీ, హీమటాలజీ చికిత్సలతో, ప్రోటోకాల్ ఆధారిత కెమోథెరపీ ద్వారా జబ్బును నయం చేయవచ్చునన్నారు. ఇటీవల కాలంలో జగిత్యాలకు చెందిన యువరోగి అత్యంత ప్రమాదకరమైన రక్త క్యాన్సర్తో బాధపడుతూ మలక్పేట్ యశోద ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించారన్నారు. వైద్యులు సమయానికి ఇండక్షన్, కన్సాలిడేషన్ కెమోథెరపీతో పాటు సమగ్రసహాయక చికిత్సల ద్వారా రోగి ప్రాణాలు కాపాడి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో మలక్పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, డిప్యూటీ జనరల్ మేనేజర్ లక్ష్మణ శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ వాసుకిరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలి

**- ఉద్యాన శాఖ జిల్లా అధికారి జి. శ్యాం ప్రసాద్**

**సూర్య జగిత్యాల**



జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరిగే విధంగా సర్పంచులు ఆయా గ్రామాలలో రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్యాం పసాద్ అన్నారు. శుక్రవారం అర్బన్ కాలనీ లోని నాక్ సెంటర్‌లో నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచులకు ఉద్యాన శాఖ జగిత్యాల జిల్లా అధికారి జి. శ్యాం ప్రసాద్ పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను అదేవిధంగా ఆయిల్ పామ్ పంట సాగు చేసే విధానాలను, ప్రభుత్వం ఇస్తున్న రాయితి వివరాలు, లాభాలు, మార్కెటింగ్ అంశాలు సర్పంచ్ లకు వివరించారు. కోతులు వన్య ప్రాణుల బెడద లేని పంటగా ఆయిల్ ఫామ్ సాగు చేయవచ్చని గ్రామ సర్పంచ్‌లు గ్రామాలలోని రైతులను ఉద్దేశించి సర్పంచ్‌లకు ఆయిల్ పామ్ తోట సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామ, గ్రామాన ఉద్యన పంటల వైపు రైతులను మళ్లించడంలో సర్పంచ్‌ల సహకారం చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమం లోఎంపీడీఓ చిరంజీవి, మల్యాల, కొడిమ్యాల, పెగడపెల్లి, ధర్మపురి, బుగ్గరం ఎండపెల్లి, వెల్గటూరు మండలం లోని గ్రామ సర్పంచ్‌లు ఉద్యాన విస్తీర్ణ అధికారి ఎన్.అనిల్ పాల్గొనడం జరిగినది.

## డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం సిరి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర కమీషను పేరుతో కాలాయాపన చేయకుండా ఒకే కమీషన్ చెల్లించాలని, గతేడాది నుండి రేషనుషాపుల్లో మగ్గుతున్న దొడ్డుబియ్యాని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రూ.5వేల గౌరవవేతనం చెల్లించాలన్నారు. రేషను షాపులను మిని సూపర్ మార్కెట్లుగా గుర్తించి తక్కువ ధరకే నిత్యవసర సరుకులు అందుబాటులోకి తేవాలని, డీలర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, వేబ్రిడ్జీల ఏర్పాటు, కరోనాతో మరణించిన డీలర్ల కుటుంబనికి రూ.20లక్షలు పరిహారం చెల్లించాలని, అద్దె, కరెంటుబిల్లు, ఇతర ఖర్చులను ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఎప్పటి కమీషన్ అప్పుడే జమచేయాలని, హైద్రాబాదులో రేషన్ భవన్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని, అర్హతను బట్టి డీలర్లకు పదోన్నతులు కల్పించాలని రమేష్ బాబు కోరారు. అంతకుముందు నూతన జిల్లా అధ్యక్షుడిగా మద్దెల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దొంకెన తిరుపతిగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డిమల్ల హన్మాండ్లు, ఊక శేఖరరావు, చంద్రశేఖర్, పులిమామిడి లక్ష్మినారాయణ, కిరణ్ కుమార్ రెడ్డి, చిలగాని మోహన్, పోతరాజు రమేష్, భానుచందర్ రావు, వెంకన్న, భాస్కర్ రెడ్డి, సందీప్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లంతకుంట మండల గౌడ యువజన విభాగం అధ్యక్షుడి గా బుర్ర సూర్య గౌడ్

**సూర్య,ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండల గౌడ యువజన సంఘం అధ్యక్షుడుగా ఆరేపల్లి గ్రామానికి చెందిన బుర్ర సూర్య గౌడ్‌ను నియమించినట్లు గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్ నియామక పత్రాన్ని శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా బుర్ర సూర్య గౌడ్ మాట్లాడతూ గౌడ బిడ్డల కోసం నిరంతరం పోరాటం చేస్తానని సర్దార్ పాపన్న ఆశయాల కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొత్తూరు గ్రామ అధ్యక్షులు బండారి మహేష్ గౌడ్,నాయకులు అనిల్ గౌడ్,ఎల్లయ్య గౌడ్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన కాంగ్రెస్ యువ నాయకుడు

**సూర్య ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన జెల్లా సంతమల్లు అనే వ్యక్తికి కాలి గాయానికి అత్యవసరంగా సర్జరీ చేయాలని AB+ve రక్తం కావాలని మెట్టుపల్లి సాయి సంజీవని హాస్పిటల్ వారు తెలపగా శుక్రవారం, మిత్రుడి ద్వారా విషయంతెలుసుకొని వెంటనే సమయానికి అక్కడికిచేరుకొని అతి అరుదుగా దొరికే AB+ve రక్తాన్ని ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంశీ పిట్టల అందించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి, రక్తదానంచేసిన వంశీ పిట్టలకి ఆ కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపగా, సేవాకార్యక్రమాల్లో ఎప్పుడూ చురుగ్గాపాల్గొనే వంశీని పలువురు ప్రశంసించారు.

## డీలర్‌కు పురుగుల మందులను అమ్మకూడదని నోటీసుల జారీ

**- మండల వ్యవసాయాధికారి యోగిత**

**సూర్య - కథలాపూర్**

మండలంలోని గంభీర్ పూర్,తాండ్రియాల గ్రామాల్లోని పురుగుల మందుల దూకాణలలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి యోగిత తనీఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా గంభీర్ పూర్ రుద్ర ఫెర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందులకు సంబంధించి ఎటువంటి పిసిలు అందుబాటులో లేవని,ఈ పిసిలు లైసెన్స్ అమెండ్మెంట్ కాలేదని తెలిపారు. స్టాక్ రిజిస్టర్ లో సరైన వివరాలు నమోదు చేయనందున రుద్ర ఫెర్టిలైజర్‌లో ఉన్న పురుగుల మందులను 15 రోజుల పాటు రైతులకు అమ్మకూడదని డీలర్ కు నోటీసులు జారీ చేసినట్లు ఆమే తెలిపారు.ఆనంతరం తాండ్రియాలలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో తనిఖీలు చేయగా పెస్టిసైడ్ రిజిస్టర్ లో సరైన నిలువల పట్టిక,ధరల పట్టికలను దుకాణంలో పొందుపరచకపోవడంతో డీలర్‌ను మందలిస్తు వాటిని సరిచేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

## విద్యార్థులు సామాజిక రుగ్మతల పట్ల అవగాహన కల్గివుండాలి

**- ఎస్సై సుధీర్ రావు**

**సూర్య, రాయికల్**



జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ సూచనలను అనుసరించి రాయికల్ ఎస్సై సుధీర్ రావు ఆధ్వర్యం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్‌లో పోలీస్ కళా బృందంచే విద్యార్థులకు సామాజిక రుగ్మతల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన,ట్రాఫిక్ నియమాలు,సామాజిక రుగ్మతలు,మూఢనమ్మకాలు,రోడ్డు భద్రతా నియమావళి వంటి అంశాల పట్ల అవగాహనలో భాగంగా ఆరైవ్-అలైవ్ కార్యక్రమం,ఆధునిక చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు శంకరయ్య, సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్,సంజయ్ కుమార్, వేణుగోపాల్, సురేష్,పుష్పలత, భవానీ,శైలజ మరియుపోలీస్ కళా బృందశీ పోలీస్ కానిస్టేబుల్ మనోజ్ కుమార్, గడ్డం రమేష్, కమల్, సతీష్, లక్ష్మణ్, హనుమంత్ పాల్గొన్నారు.

## సీఎం కప్ 2026లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



సీఎం కప్ 2026 రాష్ట్రస్థాయి క్రీడ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించిన క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా నుంచి వెళ్లిన 22 మంది విద్యార్థులు 4 బంగారు పతకాలు,8 వెండి పతకాలు,10 కంచు పతకాలు గెలుచుకున్నారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, పేట ప్రెసిడెంట్ సురేందర్, పేట రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభరాణి, ఆర్చరీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్, వివిధ క్రీడల కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో

# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు

**సూర్య-గోదావరిఖని:**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు కమిషనరేట్ వ్యాప్తంగా శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించబడ్డాయి. 'అరైవ్-అలైవ్' రెండో విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో ఆటో, వ్యాన్, టాక్సీ, లారీ డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు శిబిరాలను పర్యవేక్షించి డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు. కొంతమందికి కలర్ బ్లైండ్ సమస్య ఉండడం, వయస్సు



పెరుగుదలతో కంటి చూపు మందగించడం వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. అలాంటి వారు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని వివరించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల వ్యాప్తంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు సీపీ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడంతో పాటు తదుపరి చికిత్సను కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరం ద్వారా సుమారు 300 మంది డ్రైవర్ల కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు డ్రైవర్లకు పలు ముఖ్య సూచనలు చేశారు. వేగ పరిమితులు పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ గౌరవించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం వంటి నియమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాల పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవడం, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించడం అవసరమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని అధికారులు స్పష్టం చేశారు. ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



## కూతురు నిశ్చితార్థానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన సుడా చైర్మన్

**సూర్య కరీంనగర్**

మార్చి 06 న హైదరాబాద్ లో జరగనున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూతురు రిషితా రెడ్డి రాహుల్ రెడ్డి నిశ్చితార్థానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కుటుంబ సమేతంగా కలిసి ఆహ్వానించారు.



## స్వచ్ఛ రామగుండం లక్ష్యం గా పనిచేయండి

**- ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుధ్య సిబ్బంది పాత్ర అత్యంత కీలకం**

**- నగర మేయర్ మహంకాళి స్వామి**

**సూర్య-గోదావరిఖని:**

స్వచ్ఛ రామగుండంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు పారిశుధ్య సిబ్బంది వారికి కేటాయించిన పనులను మరింత బాధ్యతతో, సమర్థవంతంగా చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచించారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సానిటేషన్ సిబ్బంది, వాహనాలను సమర్థవంతంగా వినియోగించి గృహస్థులు చెత్త బయట పడవేయకముందే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని ఆదేశించారు. రోజు విడిచి రోజు తప్పనిసరిగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మురుగు నీటి కాలువలను నిర్ణీత కాలవ్యవధిలో తప్పకుండా శు భ్రపరచాలని, ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుధ్య సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, నగరాన్ని శుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఇంకా ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, డి.ఇ. శాంతి స్వరూప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సంపత్ తదితరులతో పాటు సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

### అనాధ వృద్ధుని చేరదీసిన(స్పందన) మంచి కట్ల శ్రీనివాస్..

**సూర్య రామడుగు**

రామడుగు మండలం దేశరాజు పల్లి గ్రామంలో స్పందన వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు మంచి కట్ల శ్రీనివాస్ శుక్రవారం వృద్ధ అనాధను చేరదీశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంచిర్యాల చౌరస్తాలో ఫుట్ పాత్ పై జీవనం సాగిస్తూ రామదాసు అనే పేరు గల ఓ వృద్ధుని అవస్థలు చూడలేక వృద్ధునికి గడ్డం కటింగ్ చేయించి స్నానం చేయించి కొత్త బట్టలు వేసి అతని స్పందన వృద్ధుల ఆశ్రమానికి తరలించారు. దీంతో అనాధ వృద్ధుని వృద్ధుల ఆశ్రమంలో చేర్పించడంతో పునర్జన్మ ప్రసాదించినట్లు అయిందని ఆశ్రమ నిర్వాకులు మంచికట్ల శ్రీనివాస్ తెలిపారు.









## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలోనే రామగుండం అభివృద్ధి సాధ్యం.

**- కాంగ్రెస్‌లోకి యువ నాయకుల చేరిక.**

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**

రామగుండం సమగ్ర అభివృద్ధి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలోనే సాధ్యమనే నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పలువురు యువ నాయకులు శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో, కాలనీ అధ్యక్షులు గుండేటి రాజేష్ సూచనలతో, 16వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గడ్డం భాగ్యలక్ష్మి తిరుపతి యాదవ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని వారు పార్టీలో అధికారికంగా చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బాలసాని నాగరాజు, మహమ్మద్ ఆసీమోద్దీన్, మేకల చంద్రమౌళి, ఎం.డి. రహీం, పానుగంటి రాము తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, రామగుండం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు.

### కట్లకుంట ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర వేళ :

**సూర్య మేడిపల్లి**

మండలంలోని కట్లకుంట ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాన్ సాగర్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అనుమల వైకుంఠం పర్యవేక్షణలో 34 మంది విద్యార్థులు సాంఘిక శాస్త్రవేళాలో ప్రతిభాపాటవాలను ప్రదర్శిం చారు. ఈ ప్రదర్శనలో భాగంగా భూమి ఏ విధంగా గుండ్రంగా ఉంది, దానికి గల కారణాలు, సమాజంలో పౌరుల యొక్క బాధ్యతలు, హక్కులు, ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధుల ఎన్నిక ప్రదర్శన, వివిధ దేశాల యొక్క కరెన్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు హనుమాన్ సాగర్ మాట్లాడుతూ వరుసగా నాలుగు సార్లు విద్యార్థుల యొక్క ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వైకుంఠం చేసిన కృషి అద్భుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి చింతకింది చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజయ్య, రమాదేవి, సంతోష్, గోపికృష్ణ, రవీందర్, ఇమామ్ లు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సూర్య, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో వెలసిన శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో జరుగుతున్న శ్రీ సీతారామ స్వామివారి కల్యాణ వేడుకల్లో మంత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ క్రమంలో స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న మంత్రి, స్వయంగా పల్లకిని భుజాన మోసి తన భక్తిని చాటుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య మంత్రికి ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ బాధ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కార్మిక కుటుంబాలకు సురక్షిత త్రాగునీరు అందించాలి.

**- కార్పొరేటర్ మందల రమా కిషన్ రెడ్డి.**

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**



ఎనిమిదో కాలనీలోని కార్మిక కుటుంబాలకు సురక్షిత తాగునీరు అందించాలంటూ కార్పొరేటర్ మందల రమా--కిషన్ రెడ్డి శుక్రవారం అర్జి--2 ఏరియా జనరల్ మేనేజర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎనిమిదో కాలనీలో కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తున్న తాగునీటిలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అంతేకాకుండా దుర్వాసనతో కూడిన డ్రైనేజీ నీరు కలిసివస్తుండటంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రతి రోజు సురక్షిత త్రాగునీరు సరఫరా చేయాలని కోరారు. అలాగే 16వ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని బోర్‌వెల్‌లను వెంటనే మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని జీఎం బండి వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. రాబోయే ఉగాది పండుగ సందర్భంగా 8వ కాలనీ పరిసర ప్రాంత ప్రజలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో, 16వ డివిజన్‌లోని పోచమ్మ తల్లి ఆలయ ప్రహరీ గోడకు మరమ్మతులు చేసి సున్నం వేయాలని కూడా కోరారు. ఈ అంశాలపై స్పందించిన జనరల్ మేనేజర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కటకం సతీష్, ఆకుల నవీన్, అవనిగంటి శ్రావణ్, గుమ్మడి రామ్ చరణ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'అరైవ్-అలైవ్' లో భాగంగా పోలీస్ డ్రైవర్లకు ప్రత్యేక కంటి శిబిరం

**-పోలీస్ డ్రైవర్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ... ఉచిత కళ్ల అద్దాల పంపిణీ -రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**సూర్య-గోదావరిఖని**

రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన 'అరైవ్-అలైవ్' రెండో విడత కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో శుక్రవారం పోలీస్ డ్రైవర్ల కోసం ప్రత్యేక కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సహకారంతో ఏర్పాటు చేయగా, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రతలో డ్రైవర్ల కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విధుల్లో నిత్యం వాహనాలు నడిపే పోలీస్ డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే వాడుతున్న కళ్ల అద్దాలను పరీక్షించుకుని అవసరమైతే మార్చుకోవాలని చెప్పారు. "స్పష్టమైన కంటి చూపు ఉన్నవారే సమర్థవంతంగా సేవలు అందించగలరు. కంటి



సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుర్తించి చికిత్స పొందాలి. మెరుగైన వైద్యం కోసం పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుంది" అని సీపీ చెప్పారు. శిబిరానికి సహకరించిన లయన్స్ క్లబ్ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ డ్రైవర్లకు నిపుణులైన వైద్యులచే సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. చూపు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు అందజేశారు. అధిక స్థాయి సమస్యలు గుర్తించిన వారిని ప్రత్యేక కంటి ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా సిబ్బందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బందిలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు రహదారి భద్రతను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని సీపీ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, డాక్టర్ దుర్గ ప్రసాద్, ఆర్ఐలు శేఖర్, పెద్దన్న, మల్లేశం, వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు బాబురావు, రమేష్ బాబు, శ్రీనివాస్, భీమేష్, సీసీ హరీష్, రాజేందర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.మల్లికార్జున్, కజంపురం రాజేందర్, గుగ్గిళ్ల రవీంద్ర చారి, మారుపాక రాజేంద్ర కుమార్ తదితరులతో పాటు పోలీస్, సీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవాణి పాఠశాలలో ఘనంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**

స్థానిక శ్రీవాణి పాఠశాలలో శుక్రవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణ నైపుణ్యాలను వివిధ ప్రాజెక్టుల ద్వారా ఆకట్టుకునేలా ప్రదర్శించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను Seed Germination, Sources of Water, Solar System, Types of Plants, Layers of Soil, Layers of Atmosphere, Agriculture, Cooler, Alarm, Volcano Eruption, Solar Eclipse, Parts of Plant, Kinds of Animals వంటి అంశాలపై ప్రాజెక్ట్ రూపంలో వివరించా రు. ప్రతి ప్రాజెక్ట్ సందర్శకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొపెల్



ట్రైనర్ దిలీప్ కుమార్ విచ్చేసి చిన్నారులను అభినందించారు. ఈ దశాబ్దంలో పిల్లల భవిష్యత్తు కోసం విద్యలో కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల కరస్పాండెంట్ గూళ్ళు లక్ష్మణ్ కుమార్ , ప్రిన్సిపాల్ గూళ్ళు మానస , ఇంచార్జ్ అశోక్ మాట్లాడుతూ చిన్నారుల వైవిధ్యమైన ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకరంగా దిలీప్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను ఈ విధంగా తీర్చిదిద్దిన సైన్స్ ఉపాధ్యాయురాలు సాయిప్రసన్న ప్రత్యేకంగా అభినందించారు. ప్రదర్శనను సందర్శించిన తల్లిదండ్రులు తమ చిన్నారుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు.చిన్నారుల ఉత్సాహం, తల్లిదండ్రుల ఆహ్లాదం, పెద్దల ప్రశంసల మధ్య ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## స్పందన మోడల్ స్కూల్ పోషకుల స్నేహపూర్వక క్రికెట్ పోటీలు ఘనంగా

**సూర్య యైటింక్లయిన్ కాలనీ**




స్థానిక స్పందన మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో పోషకుల స్నేహపూర్వక క్రికెట్ పోటీలను శుక్రవారం అబ్దుల్ కలాం స్టేడియంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలలో మూడు జట్లు పాల్గొన్నాయి.మొదటి మ్యాచ్‌లో కొండల్ లెవన్స్ వెంకటేష్ లెవన్ విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో ఆరిఫ్ లెవన్, వెంకటేష్ లెవన్పై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. పోషకులు ఉత్సాహంగా మైదానంలో ఆడుతూ ఫోర్లు, సిక్సర్లు కొడుతుండగా విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు.బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 15వ డివిజన్ కార్పొరేటర్ బుర్ర శశికళ ముత్యాలు గౌడ్, 16వ డివిజన్ కార్పొరేటర్ మండల రమా కిషన్ రెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో వైకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందం సురేష్, శ్రేష్ఠ ఇన్సూరెన్స్ వర్ధినేని సుధాకర్ రావు, రమణారెడ్డి, కెవియన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ రావు, శివ, మబ్బు శంకర్, గొడుగు రమేష్ యాదవ్, మ్యాన్ రమేష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రమేష్, రాకేష్, కొండల్, పిడుగు రాజు, నాగరాజు, కె. శ్రీనివాస్‌లకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు.పోషకుల ఉత్సాహం, విద్యార్థుల ఆనందం మధ్య ఈ స్నేహపూర్వక క్రికెట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి.

## హోరా హోరీగా మహిళా మత్స్య సహకార సంఘం ఎన్నిక

**-9 పోస్టులకు 15 మంది పోటీ**

**-నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో మహిళా మత్స్య సహకార సంఘం ఎన్నిక హోరాహోరీగా సాగింది. ఇటీవల అవతరించిన సంఘానికి 9 మంది పాలకవర్గ సభ్యుల పోస్టులకు 15 మంది మహిళలు పోటీపడ్డారు. దీంతో సహకార సంఘం అధికారులు ఎన్నిక నిర్వహించారు. పెద్దమ్మ దేవాలయం ఆవరణలో శుక్రవారం ఎన్నికల అధికారులు బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. పోటీ అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా ప్రచారం హోరెత్తించారు. నువ్వా నేనా అన్నట్లు తలపడగా కౌంటింగ్ అనంతరం గెలుపొందిన 9 మంది సభ్యులను ఎన్నికల అధికారులు ప్రకటించారు. సిద్ద జ్యోతి, నెల్లి మౌనిక, సిద్ద వనిత, యాదగిరి స్వప్న రాణి, సిద్ద స్వరూప, కలవెన మల్లీశ్వరి, అద్రవేన పద్మ, సిద్ద పుష్ప, పిడుగు రజిత ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికైన వారిని పలువురు సంఘం నాయకులు, సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దపల్లి టౌన్ ఎస్ఐ నరేష్, రూరల్ ఎస్ఐ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రశాంతంగా ఎన్నిక ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సిద్ద నరేందర్, పిడుగు సంపత్, సిద్ద సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి ఎన్నారై చేయూత

**సూర్య చందుర్తి**

సొంతూరి పై మమకారంతో ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారు ఎన్నారై తిప్పని నరేష్ తండ్రి లచ్చయ్య గ్రామంలో నూతనంగా నిర్మించనున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు ఆర్థిక చేయూతనిచారు.గ్రామస్తులు ఐక్యమత్యంతో ఆలయ నిర్మాణం చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామస్తులు పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ పోతరాజు భారతి నాగేశం ఉప సర్పంచ్ వేణు గ్రామస్తులుఉన్నారు

## మహాశివరాత్రి స్పెషల్ డ్యూటీ నిర్వర్తించిన ఎన్పీడీసీఎల్ సిబ్బందికి సత్కారం

**సూర్య కరీంనగర్ టౌన్**

కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో గురువారం సర్కిల్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) వరంగల్ టి. మధుసూదన్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ భీమేశ్వర ఆలయం మరియు పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 14 నుండి 16 వరకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు స్పెషల్ డ్యూటీ నిర్వహించిన సిబ్బందిని అభినందించారు.సీఈ (ఓపి) వరంగల్ వి. అశోక్, ఎస్ఈ వి. గంగాధర్ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను మెమెంటోలు అందజేసి సన్మానించారు. రాబోయే పండుగలు, ఇంటర్ మరియు ఎస్ఎస్సి పరీక్షల సమయంలో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ సూచించారు.సమావేశంలో డిఈలు ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, ఎం. తిరుపతి, చంద్రమౌళి, రమణారెడ్డి, ఎస్ఏఓ రాజేంద్రప్రసాద్, ఏవోలు, ఏఏఓలు, ఏడిఈలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం

**సూర్య మల్లాపూర్**

మండలంలోని రాఘవపేట్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజనమ్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపి ముత్యాల తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛారణల మధ్య కన్నుల పండువగా కళ్యాణ ఘట్టాన్ని పూర్తి చేసి నాగవెల్లి కార్యక్రమం జరిపారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించ చేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఎదులపురం నారాయణ, నాయకులు నర్సయ్య, రవికుమార్ యాదవ్, రాకేష్ యాదవ్, లక్ష్మణ్, రాజేందర్, స్థానిక నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం

**- ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్**

**సూర్య - పెద్దపల్లి రూరల్**

గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపిడిఓ కొప్పుల శ్రీనివాస్ అన్నారు. మండలం లోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో రెండో విడత లో శిక్షణ కు హాజరైన వార్డు సభ్యులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలన చట్టం లో వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అలాగే పరిశుభ్ర నిర్వహణ, ఉపాధి హామీ పనులు, మొక్కల పెంపకం , వీధి దీపాల ఏర్పాటు, అభివృద్ధి పనులను రికార్డు చేయాలని అన్నారు . విధి గా జనరల్ బాడీ సమావేశం కు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల రోజారాణి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## జాజిరి హోళీ వేడుకలలో చిన్నారులు

**సూర్య సెంటినరీ కాలనీ**

గ్రామాల్లో హోలీ వేడుకలు ప్రారం భం అయ్యాయి. మార్చి-04 వ తేదీన హోళీ జరుపుకోనున్నారు. ఈ క్రమంలో గ్రామంలో చిన్నారు లు కోలాటాలు పట్టుకొని జాజిరి ఆటలు ఆడుతున్నారు. ఇంటికి ఇంటికి వెళ్లి జాజిరి పాటలు, హోళీ పాటలు పాడుతున్నారు. తమకు తోచిన సహాయం అందించాలని కోరుతున్నారు.

### కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో శైలజ రాణి

**సూర్య సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం పన్నూరు గ్రామంలోని కే.జీ.బీ.వి పాఠశాల ను ఎంపిడిఓ బబ్రి శైలజ రాణి తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఎంపిడిఓ బబ్రి శైలజ రాణి కే.జీ.బీ.వి పాఠశాలను భోజన సమయం లో సంద ర్శించి ఫుడ్ నాణ్యత ను, కిచెన్ లో పరిశుభ్రత ను, టాయిలెట్స్ ను, స్టోర్ రూమ్ ను, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.